CELEBRATING 11TH YEAR ANNIVERSARY

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 36 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | సోమవారం 13 అక్టోబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :36 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | MON 13 OCTOBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# విశాఖకు పదేళ్ల సమయం చాలు





- ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం
- ఆర్థిక రాజధానిగా రూపకల్పన
- 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
- ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ
- దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు రాక
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ
- రాబోయే మూడేళ్లలో మరిన్ని భారీ పెట్టుబడులు వస్తాయని లోకేశ్ ధీమా

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతి కాగా, రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2047 నాటికి విశాఖను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. విశాఖలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం రిషికొండలో జరిగిన కార్యక్రమంలో లోకేశ్ ప్రసంగించారు."ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా విధానం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మా విధానానికే పట్టం కట్టారు. సమర్థ పాలన, ఉద్యోగాల కల్పన, విశాఖను ఆర్థిక రాజధానిగా చేయడం కోసమే 94 శాతం సీట్లతో మమ్మల్ని గెలిపించారు" అని లోకేశ్ అన్నారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడానికి 30 ఏళ్లకు పైగా సమయం పడితే, విశాఖను అభివృద్ధి చేయడానికి పదేళ్ల సమయం చాలని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.

**భారత్‌లోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడి విశాఖకు**

విశాఖ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని లోకేశ్ వివరించారు. "గత 17 నెలల్లో రాష్ట్రానికి వచ్చిన 120 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో 50 శాతానికి పైగా గ్రేటర్ విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌కే వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్, భారత చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) కూడా విశాఖపట్నానికే రాబోతోంది" అని ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా విశాఖలో శక్తివంతమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు, అందులో కేవలం విశాఖలోనే 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి పరుగులు**

కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండటం వల్ల అభివృద్ధి బుల్లెట్ రైలు వేగంతో దూసుకెళుతోందని లోకేశ్ అభివర్ణించారు. "డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగాం.

వివరాలు 2లో..

# ఢిల్లీలోని ఎంబసీ మాదే...

## తాలిబన్ జెండా ఎగరేసి ప్రకటించిన అఫ్గన్ మంత్రి!

- ఢిల్లీలోని అఫ్ఘాన్ రాయబార కార్యాలయం తమదేనన్న మంత్రి ముత్తఖీ
- మీడియా సమావేశంలో తాలిబన్ల జెండా ప్రదర్శన
- ఈసారి మహిళా పాత్రికేయులకు మీడియా సమావేశానికి అనుమతి
- మహిళల విద్యను తాము వ్యతిరేకించడం లేదని స్పష్టీకరణ
- భద్రత విషయంలో పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ
- అటారీ-వాఘా సరిహద్దు తెరవాలని భారత్‌కు విజ్ఞప్తి

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ సంచలన ప్రకటన చేశారు. న్యూఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయం పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తన ముందు, వెనుక ఇస్లామిక్ ఎమిరేట్ (తాలిబన్) జెండాను ఉంచి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంకా అధికారికంగా తాలిబన్



# అమ్మాయిలు రాత్రివేళ బయటికి వెళ్లొద్దు



- పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం
- అమ్మాయిలు రాత్రి వేళల్లో బయట తిరగవద్దని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్య
- ఇలాంటి నేరాలపై తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టీకరణ
- ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- విషయంపై స్పందించిన జాతీయ మహిళా కమిషన్, నివేదికకు ఆదేశం

వివరాలు 2లో..

### వైసీపీ నేతలపై బాలకృష్ణ ఫైర్...

# అధికారం కోసమే కొత్త నాటకాలు!



- వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ఎమ్మెల్యే బాలకృష్ణ
- మళ్లీ అధికారం కోసమే వారి పనికిమాలిన ప్రసంగాలు అంటూ విమర్శ
- గత ప్రభుత్వ హయాంలో హిందూపురం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ
- వైద్య కళాశాలల అభివృద్ధిని వైసీపీ పట్టించుకోలేదని ధ్వజం
- తుమ్మలకుంటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన బాలయ్య

వివరాలు 2లో..

### ఆ భవనాల వాడకానికి

# సలహాలివ్వండి

- రుషికొండ భవనాల వినియోగంపై ప్రజల సూచనలు కోరిన ప్రభుత్వం
- పర్యాటక శాఖకు మెయిల్ చేయాలన్న టూరిజం అథారిటీ సీఈవో ఆమ్రపాలి
- పౌరుల సూచనలపై మంత్రుల బృందం సమీక్ష



పెన్ పవర్ డెస్క్:వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నం లో నిర్మించిన రుషికొండ ప్యాలెస్ ల వినియోగంపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఈ భవనాలను ఎలా వినియోగిస్తే బాగుంటుందనే విషయంపై ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానించింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రజలకు ఓ విజ్ఞప్తి చేసింది.ప్రజలు తమ సలహాలు, సూచనలను rushikonda@aptdc.inకు మెయిల్ చేయాలని టూరిజం అథారిటీ సీఈవో ఆమ్రపాలి కోరారు. ఈ నెల 17న జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమ్రపాలి తెలిపారు. ఆయా సంస్థల నుంచీ సూచనలు కోరుతామన్నారు. పౌరులు, సంస్థల నుంచి అందుకున్న సూచనలపై మంత్రుల బృందం సమీక్ష జరుపుతుందని వెల్లడించారు. అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆమ్రపాలి పేర్కొన్నారు.

# ఇందిరా గాంధీ చేసిన పొరపాటు అదే..

## ఆపరేషన్ బ్లూస్టార్‌పై చిదంబరం సంచలన వ్యాఖ్యలు

- ఆపరేషన్ బ్లూస్టార్ ఒక తప్పుడు మార్గం అని వ్యాఖ్యానించిన చిదంబరం
- ఆ పొరపాటుకు ఇందిరా గాంధీ ప్రాణాలతో మూల్యం చెల్లించారన్న కాంగ్రెస్ నేత
- అయితే అది ఇందిర ఒక్కరి నిర్ణయం కాదని, సమష్టి నిర్ణయమని వెల్లడి
- పంజాబ్‌లో ఖలిస్థాన్ వాదం ఇప్పుడు దాదాపుగా కనుమరుగైందన్న సీనియర్ నేత



వివరాలు 2లో..

### విశాఖకు గూగుల్... రాష్ట్ర చరిత్రలో

# ఇది ఒక మైలురాయి

- హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌లా.. విశాఖకు గూగుల్ అంటూ బీదా రవిచంద్ర వ్యాఖ్యలు
- సీఎం చంద్రబాబు దార్శనికత వల్లే ఇది సాధ్యమైందని వ్యాఖ్య
- రూ.55 వేల కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు
- గత ప్రభుత్వ ఐదేళ్ల పనితీరును 16 నెలల్లోనే అధిగమించామని వెల్లడి
- ప్రాంతానికో పరిశ్రమతో అభివృద్ధి వికేంద్రీకరణకు శ్రీకారం
- విశాఖ టెక్ హబ్‌గా, తిరుపతి ఎలక్ట్రానిక్స్ హబ్‌గా అభివృద్ధి



వివరాలు 2లో..

# జగన్ వస్తున్నారని తెలిసి ఆ హామీ ఇచ్చారు

- సుమారు రూ. 540 కోట్ల బకాయిలు చెల్లించలేదని రోజా ఆరోపణ
- సీజన్ ముగిసి నాలుగు నెలలైనా రైతులకు అందని డబ్బులు
- జగన్ పర్యటనను దృష్టిలో పెట్టుకునే హామీ ఇచ్చారని విమర్శ
- రైతులు సమావేశం పెట్టుకోవడానికి కూడా అనుమతి నిరాకరిస్తున్నారంటూ ఆగ్రహం
- బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు మామిడి రైతులను దారుణంగా మోసం చేశారని వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ. 540 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. సొంత జిల్లా మామిడి రైతులకు బాబు మార్కు మోసం అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. "మోసానికి మారుపేరు చంద్రబాబు! నమ్మిన వారినే మోసం చేయడం

# ఆ పాపం మీదే, డ్రామాలు ఆపండి

## రోజాపై పంచుమర్తి అనురాధ ఫైర్



- కల్తీ మద్యం వ్యవహారంలో వైసీపీ, టీడీపీ మధ్య మాటల యుద్ధం
- వైసీపీ నేత రోజాపై టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తీవ్ర విమర్శలు
- మాట మీద నిలకడ లేకే 'తైతక్కల రోజా' అనాల్సి వస్తోందని వ్యాఖ్య
- మొలకలచెరువు కల్తీ మద్యం పాపం వైసీపీ ప్రభుత్వానిదేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వమే ఈ వ్యవహారాన్ని బయటపెట్టిందన్న అనురాధ

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### చంద్రబాబుపై మోడీ 'మెప్పు మంత్రం'.. బుట్టలో పడితే కష్టమేనా?

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. రాజకీయ చతురత చాలా భిన్నంగా ఉంటుంది. ఆయన ఎవరినీ అంత సామాన్యంగా మెచ్చుకోరు. ఒకవేళ మెచ్చుకున్నారంటే.. ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నార న్న సంకేతాలు ఇచ్చేసినట్టేనన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతుంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు.. నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మోడీ వేసే తొలి గేలం మెప్పు. వారిని ఆకాశానికి ఎత్తేస్తారు. ఇక, పదే పదే సమస్యలతో తన వద్దకు వచ్చే వారిని కూడా ఆయన మెచ్చుకుంటారు. తద్వారా.. వారి నోటికి తాళం వేసే ప్రయత్నం చేస్తారని అంటారు. అంటే.. ఎవరైన పదే పదే సమస్యల చిట్టాను పట్టుకుని ప్రధాని చుట్టూ తిరిగితే.. ఆయన సహించలేరు. వీరిని నిలువరించేందుకు పలు మంత్రాలు వేస్తారు. దీంతో కీలకమైంది.. మెప్పు మంత్రం. దీని ద్వారా ఏదైనా అడగాలని అనుకున్నవారు కూడా.. మోడీ మాటలకు పడిపోతారు. ఈ విషయాన్ని గతంలో బీహార్ సీఎం నితీష్ కుమార్ మాత్రమే కాదు.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా చెప్పుకొచ్చారు. %--%మేం ఏదో అడగాలని ఆయన దగ్గరకు వెళ్తాం. ముందు బాగా రిసీవ్ చేసుకుంటారు. ఏదైనా సమస్య చెప్పే సరికి.. మీరు అద్భుతం.. చాలా ఫ్యూచర్ ఉంది.. అని మెచ్చుకుంటారు. ఇంక మేం ఏం మాట్లాడతాం.%--% అని నితీష్ వ్యాఖ్యానించిన సందర్భాలు చాలానే ఉన్నాయి.ఇలానే.. ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు విషయంలోనూ మోడీ వ్యవహరిస్తున్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఏపీ సీఎం చంద్రబాబును తాజాగా మోడీ ఆకాశానికి ఎత్తేశారు. బాబు విజన్, సుపరిపాలన అద్భుతం అంటూ.. ప్రశంసలు గుప్పించారు. అంతేకాదు.. 2000 సంవత్సరం నుంచి కూడా తనకు బాబుతో సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇంకేముంది.. సహజంగానే పొగడ్తలకు పడిపోని నాయకుడు ఎవరుంటారు. పైగా చంద్రబాబు అయితే.. మరీ ఎక్కువ.ఫలితంగా.. ఏపీ సమస్యలపై కేంద్రం వద్ద ఆయన గట్టిగా మాట్లాడలేని పరిస్థితి వస్తుందని అంటున్నారు పరిశీలకులు. మోడీకి కావాల్సింది కూడా. . ఇదే!. అందుకే.. తరచుగా బాబుపై మోడీ ప్రశంసల మంత్రాలు పఠిస్తున్నారని హెచ్చరిస్తున్నారు. కానీ, ఈ మెప్పులకు పడిపోకుండా.. రాష్ట్రానికి కావాల్సినవి అడిగి తీసుకోవాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉంటుందని మోడీ గురించి బాగా తెలిసిన విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి బాబు ఏం చేస్తారో చూడాలి.

# ఢిల్లీలోని ఎంబసీ మాదే...

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వాన్ని గుర్తించనప్పటికీ, ఎంబసీలో పాత జెండానే కొనసాగుతున్నప్పటికీ ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. "ఇది మా జెండా. దీని నీడలోనే మేం జిహాద్ చేశాం. ఈ ఎంబసీ నూటికి నూరు శాతం మాదే. ఇక్కడ పనిచేస్తున్న వారంతా మాతోనే ఉన్నారు" అని ముత్తాఖీ ఒక ప్రశ్నకు బదులిస్తూ తేల్చి చెప్పారు.గతంలో మహిళా జర్నలిస్టులను అనుమతించలేదని విమర్శలు రావడంతో, ఈసారి ఆదివారం నాటి సమావేశానికి మహిళా జర్నలిస్టులతో సహా పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులను అనుమతించారు.

**భారత్‌తో ఫలవంతమైన చర్చలు**

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన చర్చలు ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా సాగాయని ముత్తాఖీ తెలిపారు. "వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, విమాన సర్వీసులు, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించాం. వాణిజ్య వీసాలు, విద్యార్థుల మార్పిడి, ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది" అని ఆయన వివరించారు. కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా భారత్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు.ఢిల్లీ–కాబూల్, ముంబై–కందహార్, అమృత్‌సర్–ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొత్త విమాన సర్వీసులను ప్రారంభించే ప్రణాళికలను ముత్తాఖీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వాణిజ్య కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు, ఖనిజాలు, వ్యవసాయం, క్రీడల రంగాల్లో సహకారంపై కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆఫ్ఘన్ సరుకుల కోసం అటారీ–వాఘా సరిహద్దును తెరవాలని భారత్‌ను కోరినట్లు ఆయన ధృవీకరించారు.

**మహిళల విద్య, పాకిస్థాన్‌పై వ్యాఖ్యలు**

మహిళల హక్కులపై అడిగిన ప్రశ్నకు, "ఇస్లాంలో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరి హక్కులకు రక్షణ ఉంది. మేం విద్యకు వ్యతిరేకం కాదు. విద్య హరామ్ కాదు" అని ముత్తాఖీ అన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో బాలికలతో సహా కోటి మందికి పైగా విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారని, కేవలం కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లోనే ఆంక్షలున్నాయని పేర్కొన్నారు.

పాకిస్థాన్ విషయంలో ముత్తాఖీ కఠిన స్వరంతో మాట్లాడారు. "మేం శాంతియుత సంబంధాలనే కోరుకుంటాం. కానీ సంబంధాలు దెబ్బతింటే, భద్రతను ఎలా కాపాడుకోవాలో మాకు కూడా తెలుసు" అని హెచ్చరించారు. ఆఫ్ఘనిస్థాన్‌ను నిందించే బదులు పాకిస్థాన్ తమ చెక్‌పోస్టులను అదుపులో పెట్టుకోవాలని సూచించారు. తెహ్రీక్–ఏ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు తమ గడ్డపై లేరని ఆయన స్పష్టం చేశారు.

# జగన్ వస్తున్నారని తెలిసి ఆ హామీ ఇచ్చారు

- మొదటి పేజి తరువాయి

ఆయన ప్రత్యేకత. ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేశారు. ఇచ్చిన హామీల గురించి అడిగితే 'నాలుక మందం' అంటున్నారు. ఇప్పుడు సొంత జిల్లా చిత్తూరు మామిడి రైతులకూ చంద్రబాబు తనదైన శైలిలో మోసం చేస్తున్నారు.

మా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గారు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతుల సమస్యలపై పర్యటించి, వారికి గిట్టుబాటు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న బంగారుపాళ్యానికి రానున్నారన్న సమాచారం తెలిసి, రైతులను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు కొత్త నాటకం ఆడారు. తోతాపురి మామిడి కిలోకు ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వం రూ.4 చొప్పున మొత్తం రూ.12 ఇస్తామని హామీ ఇచ్చి, మామిడి రైతుల సమస్య పరిష్కారమైందని అబద్ధ ప్రచారం చేశారు. చంద్రబాబు మాటను నమ్మిన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన దాదాపు 30 వేల మంది రైతులు 4.5 లక్షల టన్నుల తోతాపురి మామిడిని ఫ్యాక్టరీలకు తరలించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఫ్యాక్టరీల వాటా రూ.360 కోట్లు, ప్రభుత్వ వాటా రూ.180 కోట్లు కలిపి, మొత్తం రూ.540 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. కానీ మామిడి సీజన్ ముగిసి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రైతులకు అందలేదు. తమ ఆవేదనను చర్చించుకోవడం కోసం రైతులు రాజకీయాలకు అతీతంగా బంగారుపాళ్యంలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలనుకున్నా, ఆ సమావేశానికి అనుమతి ఇవ్వకపోవడం దారుణం. చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా మామిడి రైతుల బకాయిలు తక్షణం చెల్లించాలని చిత్తూరు జిల్లా ఆడబిడ్డగా నేను డిమాండ్ చేస్తున్నాను. మామిడి రైతుల పోరాటానికి ఎల్లప్పుడూ నా మద్దతు ఉంటుంది" అని రోజా పేర్కొన్నారు.

# అమ్మాయిలు రాత్రివేళ బయటికి వెళ్లొద్దు

పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అమ్మాయిలు, ముఖ్యంగా హాస్టళ్లలో ఉండే విద్యార్థినులు రాత్రి వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని ఆమె సూచించారు. అయితే, ఇలాంటి కిరాతక ఘటనల పట్ల తమ ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు ఆమె స్పష్టం చేశారు. ఆదివారం కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, "బయటి రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. రాత్రిపూట ఎవరు ఎక్కడికి వెళుతున్నారో పోలీసులకు తెలియదు. ప్రతి ఇంటికీ వెళ్లి పోలీసులు కాపలా కాయలేరు కదా. రాత్రి 12:30 గంటలకు బయటకు వెళ్లినప్పుడు ఏదైనా జరిగితే...! మేము ఆ ఘటనను ఖండిస్తున్నాం. ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ అందరికీ ఉంది, కానీ జాగ్రత్తగా ఉండాలి" అని మమతా బెనర్జీ అన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి కూడా బాధ్యత ఉంటుందని ఆమె గుర్తుచేశారు.

**అసలేం జరిగింది?**

ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన ఓ యువతి దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితుడితో కలిసి భోజనం కోసం కాలేజీ క్యాంపస్ బయటకు వెళ్లింది. ఆ సమయంలో బైక్‌లపై వచ్చిన కొందరు యువకులు వారిని వెంబడించి, అసభ్యంగా ప్రవర్తించారు. విద్యార్థిని స్నేహితుడిని బెదిరించి పంపించివేసి, ఆమెను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మొబైల్ ఫోన్ కూడా లాక్కుని పడేశారు. కాసేపటి తర్వాత ఆ స్నేహితుడు మరికొందరితో కలిసి అక్కడికి చేరుకోగా, విద్యార్థిని గాయాలతో కిందపడి ఉండటాన్ని గమనించి ఆసుపత్రికి తరలించారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనకు సంబంధించి షేక్ రియాజుద్దీన్, అపు బౌరి, ఫిర్దోస్ షేక్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (%చీజఔ%) కూడా స్పందించింది. ఐదు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని పశ్చిమ బెంగాల్ డీజీపీని ఆదేశించింది. విద్యార్థినికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మెడికల్ కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

# విశాఖకు పదేళ్ల సమయం చాలు

- మొదటి పేజి తరువాయి

కేంద్రం రూ.11 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లు అందించి ప్లాంట్‌ను ఆదుకున్నాయి. ప్రస్తుతం మూడు ఫర్నేస్‌లు పనిచేస్తున్నాయి. త్వరలోనే వంద శాతం సామర్థ్యంతో నడిపి లాభాల బాట పట్టిస్తాం" అని ఆయన వివరించారు. రైల్వే జోన్ సాధించామని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఈ పెట్టుబడులు తీసుకురావడం వెనుక ఎనిమిదేళ్ల కృషి ఉందని లోకేశ్ తెలిపారు. సిఫీ ఛైర్మన్ రాజు వేగేశ్నను 2017లో కాలిఫోర్నియాలో కలిసినప్పటి నుంచి ఈ ప్రయాణం మొదలైందని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ విశాఖకు రావడంలో మంతెన రామరాజు, ఎన్నారై టీడీపీ నేత సాగర్ దొడ్డపనేని, ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్ వంటి వారు కీలక పాత్ర పోషించారని అభినందించారు. రాబోయే మూడు నెలల్లో మరిన్ని పెట్టుబడులు విశాఖకు తరలివస్తాయని, ఏ ఒక్క పెట్టుబడి కూడా పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరా గాంధీ చేసిన పొరపాటు అదే..

1984 నాటి ఆపరేషన్ బ్లూస్టార్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయాన్ని ఉగ్రవాదుల నుంచి విడిపించేందుకు సైన్యాన్ని ఉపయోగించడం ఒక 'తప్పుడు మార్గం' అని ఆయన అభివర్ణించారు. ఆ పొరపాటుకు నాటి ప్రధాని ఇందిరా గాంధీ తన ప్రాణాలతో మూల్యం చెల్లించుకున్నారని వ్యాఖ్యానించారు.కసౌలీలో జరిగిన ఒక సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న చిదంబరం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "సైనిక అధికారుల పట్ల నాకు ఎలాంటి అగౌరవం లేదు, కానీ స్వర్ణ దేవాలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి అది సరైన పద్ధతి కాదు. కొన్నేళ్ల తర్వాత సైన్యాన్ని దూరంగా ఉంచి, సరైన పద్ధతిలో ఎలా చేయాలో మేమే చూపించాం. బ్లూస్టార్ ఒక తప్పుడు విధానం, ఆ తప్పు వల్లే ఇందిరా గాంధీ తన జీవితాన్ని కోల్పోయారని నేను అంగీకరిస్తున్నాను" అని చిదంబరం స్పష్టం చేశారు. అయితే, ఆ నిర్ణయం కేవలం ఇందిరా గాంధీ ఒక్కరిదే కాదని, సైన్యం, పోలీసులు, నిఘా వర్గాలు, సివిల్ సర్వీస్ అధికారులందరి సమష్టి నిర్ణయమని ఆయన వివరించారు. ప్రస్తుత పంజాబ్ పరిస్థితిపై కూడా చిదంబరం స్పందించారు. పంజాబ్‌లో ఖలిస్థాన్ లేదా ప్రత్యేక దేశం కోసం డిమాండ్లు దాదాపుగా కనుమరుగయ్యాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆర్థిక దుస్థితేనని పేర్కొన్నారు. "నేను పంజాబ్‌లో పర్యటించినప్పుడు నాకు అర్థమైంది ఏమిటంటే, అక్కడ వేర్పాటువాదం దాదాపుగా చచ్చిపోయింది. ఆర్థిక సమస్యలే అసలైన సవాలుగా మారాయి" అని ఆయన తెలిపారు.

**ఏమిటీ ఆపరేషన్ బ్లూస్టార్?**

1984 జూన్ 1 నుంచి 8 వరకు అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో ఆపరేషన్ బ్లూస్టార్ జరిగింది. ఖలిస్థాన్ వేర్పాటువాద నేత జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే, అతడి అనుచరులను ఆలయం నుంచి ఏరివేసేందుకు నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం సైనిక చర్య చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో వందలాది మంది మరణించారు. ఈ ఘటన సిక్కుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. దీనికి ప్రతీకారంగా, అదే ఏడాది అక్టోబర్ 31న ఇందిరా గాంధీని ఆమె సిక్కు బాడీగార్డులే హత్య చేశారు.

# ఆ పాపం మీదే, డ్రామాలు ఆపండి

వైసీపీ నేత, మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాట మీద నిలకడ లేకపోవడం వల్లే రోజాను 'తైతక్కల రోజా' అని పిలవాల్సి వస్తోందంటూ ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొలకలచెరువులో ఇటీవల వెలుగుచూసిన కల్తీ మద్యం వ్యవహారానికి గత వైసీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు."పీనుగ పోయినా... ఆ పీనుగ చేసిన పాపం ఇంకా అక్కడ అక్కడ కన్పిస్తూనే ఉంది తైతక్కల రోజా గారు. మీ హయాంలో నాసిరకం మద్యంతో ప్రజల రక్తాన్ని స్ట్రా వేసి మరీ పీల్చేశారు... అది గుర్తుంచుకోండి. మీ పాపాల్ని తుడిచే ప్రయత్నంలోనే మొలకల చెరువులో కల్తీ సారా వ్యవహారం వెలుగులోకి వచ్చిందనే విషయం తెలుసుకోండి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఈ కల్తీ సారా పాపం పురుడు పోసుకుంది. దాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బయట పెట్టింది. మొలకల చెరువు కల్తీ సారా అంశాన్ని బయట పెట్టింది కూటమి ప్రభుత్వం. ప్రభుత్వంలోని ఎక్సైజ్ అధికారులు, మేము ప్రక్షాళన చేస్తుంటే... ఆ పాపాన్ని ప్రభుత్వంపై నెడతున్నారు. గొడ్డలి పోటు నుంచి గులక రాయి వరకు మీ డ్రామాలు చూశాం. మీరు ఇలా మాట్లాడ్డం...

మాకేం ఆశ్చర్యమనిపించడం లేదు. తప్పు మీరు చేయడం.. నెపాన్ని మా మీద నెట్టడం మీకు అలవాటేగా...? వివేకా హత్య కేసులో సీబీఐ ఎంక్వైరీ వద్దని జగన్ ఎందుకు డిమాండ్ చేశారనే దానికి సమాధానం చెప్పి.. ఆ తర్వాత కల్తీ లిక్కర్ వ్యవహారం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తే బాగుంటుంది" అని పంచుమర్తి అనురాధ స్పష్టం చేశారు.

# వైసీపీ నేతలపై బాలకృష్ణ ఫైర్... అధికారం కోసమే కొత్త నాటకాలు!

వైసీపీ నేతలు మళ్లీ అధికారంలోకి రావాలనే ఆశతో పనికిమాలిన ప్రసంగాలు చేస్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఏమాత్రం అభివృద్ధి చేయని వారు, ఇప్పుడు కొత్తగా పీపీపీ మోడల్ పై నాటకాలు ఆడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామంలో పర్యటించిన ఆయన, అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాలకృష్ణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో హిందూపురం నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ నేతలు కేవలం అధికారంపై యావతోనే ఉన్నారు. అప్పట్లో వైద్య కళాశాలల అభివృద్ధికి వారు చేసిందేమీ లేదు. ఇప్పుడు మాత్రం అధికారంలోకి రావాలనే ఉబలాటంతో ఏవేవో ఊహించుకుంటూ మాట్లాడుతున్నారు" అని బాలకృష్ణ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధిని, ముఖ్యంగా వైద్య విద్యా సంస్థలను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆయన ఆరోపించారు.తన లక్ష్యం హిందూపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమేనని బాలకృష్ణ స్పష్టం చేశారు. ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామానికి చేరుకున్న బాలకృష్ణకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# విశాఖకు గూగుల్... రాష్ట్ర చరిత్రలో ఇది ఒక మైలురాయి

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ విశాఖపట్నంలో కార్యకలాపాలు ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక మైలురాయి అని టీడీపీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషి వల్లే గూగుల్ వంటి ప్రపంచస్థాయి సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఒకప్పుడు హైదరాబాద్ అభివృద్ధిలో మైక్రోసాఫ్ట్ ఎలాంటి కీలక పాత్ర పోషించిందో, ఇప్పుడు విశాఖపట్నం విషయంలో గూగుల్ అదే తరహా విప్లవాత్మక మార్పు తీసుకురానుందని ఆయన అన్నారు. రూ.55 వేల కోట్ల భారీ పెట్టుబడితో గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ క్లస్టర్, దక్షిణాసియాలోనే అతిపెద్దదిగా నిలవనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠ ఇనుమడించడంతో పాటు, వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సింగిల్ విండో క్లియరెన్స్, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వంటి చర్యల ఫలితంగానే గూగుల్, టీసీఎస్, యాక్సెంచర్ వంటి సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయని రవిచంద్ర వివరించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో సాధించలేని పెట్టుబడులను, తమ కూటమి ప్రభుత్వం కేవలం 16 నెలల కాలంలోనే రాష్ట్రానికి తీసుకువచ్చిందని, ఇది సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ల సమర్థ నాయకత్వానికి నిదర్శనమని ఆయన ప్రశంసించారు.అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం ఒక్కో ప్రాంతానికి ఒక్కో పారిశ్రామిక గుర్తింపు ఇస్తోందని రవిచంద్ర తెలిపారు. ఇందులో భాగంగానే విశాఖను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), టెక్ హబ్‌గా, అమరావతిని క్వాంటం వ్యాలీగా, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలు రాష్ట్ర అభివృద్ధికి నాంది పలుకుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## వాహనదారులకు లైసెన్సు, వాహన రికార్డులు తప్పనిసరి



ముంచంగిపుట్టు ఎస్సై జె రామకృష్ణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 12.**ముంచంగిపుట్టు మండలం కేంద్రం లో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ జే రామకృష్ణ ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డ్ లు, ట్రాఫిక్ నిబంధనలు పాటించనీ వారిపై ఫైన్ లు విధించారు. తదనంతరం ఆయన వాహనదారులుతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కూడ లైసెన్స్ లు చేసుకోవాలని, హెల్మెట్ లు ధరించి నిర్ణీత వేగంలో వాహనాలు నడపాలని తెలియజేశారు. ట్రాన్స్పోర్ట్ వెహికల్ నడిపేవారు ఇన్స్యూరెన్స్ తప్పక చేసుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించవద్దని తెలిపారు. అందరూ యూనిఫామ్ ధరించి వాహనాలు నడపాలని, ఎవరైతే నిబంధలు అతిక్రమిస్తారో వారి వాహనాలు సీజ్ చెయ్యడం జరుగుతుందన్నారు.

## విశాఖను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దే దిశగా అడుగులు మంత్రి నారా లోకేష్

### విశాఖలో 10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో సగం ఈ రీజియన్‌కి ఐటీ, విద్యాశాఖ మంత్రి






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 12 :**విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను బలపరిచే దిశగా ప్రభుత్వం దృష్టిసారించినట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖ కలెక్టరే ట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధు లతో అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

లోకేష్ అన్నారు గ్రేటర్ విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి చెందితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఆ దిశగా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. సుమారు ?10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో సగం విశాఖ ప్రాంతానికే వస్తున్నాయి. ఇది ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం" అని పేర్కొన్నారు.

సిఫీ ఆధ్వర్యంలో డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశాం. టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, గూగుల్, సిఫీ, ఆర్సెలర్ మిట్టల్, ఫార్మా రంగానికి చెందిన మరో ఐదు కంపెనీలతో భారీ పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్నాం. వచ్చే నవంబర్‌లో టీసీఎస్ ప్రారంభమవుతుం ది. అదే నెలలో కాగ్నిజెంట్ సీఈవో వస్తారు. వారి కొత్త ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తాం. డిసెంబ ర్‌లో డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. రేపు ఢిల్లీలో గూగుల్‌తో కూడ ముఖ్య ప్రకటన చేయబోతున్నాం అని వెల్లడించారు.వైసీపీ ఆరోపణలను తిప్పికొడుతూ లోకేష్ అన్నారు 99 పైసలకే టీసీఎస్, కాగ్నిజెంట్‌కి భూమి ఇవ్వడం తప్పా వైసీపీ ఐదేళ్లలో తీసుకురాలేని పరిశ్రమలను మేం 16 నెలల్లోనే తీసుకువచ్చాం. అది మా కట్టుబాటు, చిత్తశుద్ధి. ప్రతి పెట్టుబడిని గ్రౌండ్ చేసే దిశగా కృషి చేస్తున్నాం అని స్పష్టం చేశారు.గ్రేటర్ విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి అవసరమైన ఎకోసిస్టమ్, రోడ్లు, ప్రభుత్వ భూముల వినియోగంపై కలెక్టర్లతో చర్చించామని ఆయన తెలిపారు.రాబోయే ఐదేళ్లలో ఐటీ రంగంలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం. ఒకే రాష్ట్రం ఒకే రాజధాని' స్ఫూర్తితో అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రజలు మాకు ఇచ్చిన విశ్వాసానికి తగిన ఫలితాలు అంది స్తాం. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తాం" అని మంత్రి లోకేష్ అన్నారు.

## మెట్టగూడలో పీఎం జన్ మన్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- శంకు స్థాపన చేసిన లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్.
- వైసిపి నాయకుడు వంతాల సాధురాం.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 12.**మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ, తుమ్మిడి పుట్టు నుండి మెట్టగూడ వరకు ఒకటిన్నర కిలోమీటర్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా త్రినాధ్ మాట్లాడుతూ.. తుమిడిపుట్టు జంక్షన్ నుండి మెట్టగూడ వరకు 1.5 కిలో మీటర్లు తారు రోడ్డు, గెడ్డలో వంతెన నిర్మాణ పనులకు 1కోటి 87 లక్షల 8 వేల రూపాయలు పీఎం జన్ మన్ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసిందని, రోడ్డు, వంతెన నిర్మాణం పూర్తయితే మెట్టగూడ నుండి లక్ష్మీపురం పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవన్నారు. గతంలో రహదారి లేక, గెడ్డలో వంతెన లేకపోవడంతో అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రిలో, నిత్యావసర సరుకులకు సంతలో, రేషన్ కొరకు డి ఆర్ డిపోకు వెళ్ళాలన్న వాహనాలు నడవక ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారన్నారు. రహదారితో పాటు వంతెన నిర్మాణం చేపడుతుండడంతో కష్టాలు తీరుతుందని హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుని సూచించారు. గతంలో అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రహదారి, వంతెన నిర్మాణాలకు చొరవ చూపిన పంచాయతీ సర్పంచ్ త్రినాధ్ కు, వైసీపీ నాయకులు సాధురంకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు జీ సాధు, కె త్రినాధ్, గోపాల్, బుద్దు, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ పోర్ట్ అధికారుల నిర్లక్ష్యం మళ్లీ బహిర్గతం



కరెంట్ తీగల బారిన రెండు గర్భిణీ ఆవుల దుర్మరణం




**ములగాడ, పెన్ పవర్, అక్టోబర్ 12 :**విశాఖ నగరంలో పోర్టు అధికారుల నిర్లక్ష్యం మరోసారి మూగజీవాల ప్రాణాలను బలి తీసుకుంది. శనివారం రాత్రి మారుతి జంక్షన్ నుంచి పారిశ్రామిక ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిపై వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగలు ప్రాణాంతకంగా మారాయి. వాటిని తాకిన రెండు గర్భిణీ ఆవులు అక్కడికక్కడే కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి.

స్థానికుల సమాచారం ప్రకారం, ఒక ఆవు నాలు గు నెలల, మరొకటి ఎనిమిది నెలల గర్భిణీగా ఉన్నట్లు తెలిసింది. ఈ దుర్ఘటన వీపీఏ లెవెల్ క్రాసింగ్ నంబర్ 20 సమీపంలో చోటుచేసుకుం ది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోర్ట్ యాజమాన్యానికి, విద్యుత్ శాఖ అధికా రులకు సమాచారం అందించినా ఎవరూ సంఘ టనా స్థలానికి రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


"మూగజీవాలు ఇలా చనిపోయినా స్పందన లేకపోతే, రేపు మనుషుల ప్రాణాలు పోయినా ఏమవుతుందో?" అని స్థానికులు మండిపడ్డారు.

ఈ ఘటనతో ఆ ప్రాంతంలో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వర్షాల సమయంలో ఈ రహదారి మీదుగా ప్రయాణించడం ప్రమాదకరమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో విద్యుత్ తీగల భద్రతపై అధికారులు కనీస శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానిక సంఘాలు ప్రభుత్వ విభాగాలు, పోర్ట్ అధికారులు ప్రజల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని మండిపడి, వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అలాగే ప్రమాద ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను సురక్షితంగా పునఃవ్యవస్థీకరించాలని వారు కోరుతున్నారు.

## రేషన్ బియ్యం సేకరణ నిమిషాలలో బియ్యం పిండి రవ్వగా!







నివాసాల మధ్యలో పిండిమిల్లు

యంత్రాల హోరు రేగుతున్న ధూళితో శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 12:** జీవీఎంసీ జోన్ 2 13 వ వార్డు కనకమహాలక్ష్మి నగర్ ప్రధాన రహదారి సమీపంలో గల భారీ యంత్రాలతో నడుస్తున్న పిండి మిల్లు. పిండి మిల్లుతో సమీప ప్రాంత ప్రజలు శ్వాసకోశ సంబంధిత మరియు ఇళ్లల్లోకి చేరుతున్న దుమ్ము ధూళి తో ఇబ్బందులకు గురవుతున్నారు.నివాసాలు మధ్య భారీ యంత్రాలతో బియ్యం రవ్వ,పిండి గోధుమలు,చోళ్ళు పప్పు ధాన్యాలు మొదలగునవి పిండి మర పట్టడం జరుగుతుంది.

సమీప ప్రాంతాల నుంచి సేకరించిన రేషన్ బియ్యం బియ్యపు పిండి,రవ్వ, నూకలుగా మార్చేస్తున్నారు. నిత్యం రేషన్ బియ్యం ద్విచక్ర వాహనాలపై తీసుకుని వచ్చి క్షణాలలో బియ్యం పిండి రవ్వగా మార్చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని,

మిల్లు నుండి భారీ యంత్రాలతో వస్తున్న ధ్వని, ధూళి వలన సమీప ప్రాంత ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని స్థానిక ప్రజలు తెలిపారు.

రేషన్ దుకాణం ద్వారా బియ్యం కొనుగోలు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని బిల్లు నిర్వాహకులు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న మిల్లు యజమాని వీరిపై సివిల్ సప్లై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

# వైఎస్సార్సీపీ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం పోస్టర్ ఆవిష్కరణ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్,అక్టోబర్ 12 :**ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలో ఆదివారం వైఎస్సార్సీపీ ఇంటెలెక్చువల్ విభాగం ఆధ్వ ర్యంలో ప్రజా ఉద్యమం కోటి సంతకాల సేకర ణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్య క్షులు దేవరకొండ మార్కండేయులు మాట్లా డుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాలతో రాజకీయ లాభాలు పొందేందుకు ప్రయత్ని స్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్య రక్షణకై కరోనా కాలంలోనే 16 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ప్రారం భించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, అసెంబ్లీలో కొంతమంది నాయకులు నిర్మాణానికి సంబంధించిన జీవోలు లేవని వ్యాఖ్యానించడం ద్వారా ప్రజా ప్రతినిధుల గౌరవ వేదికను అవ మాన పరచినట్టుగా మారిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మద్యం విధానం లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజల ప్రాణా లతో ఆడుకుంటూ మద్యం షాపులను విస్తరిం చడం సరికాద ని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షులు పిల్లా



అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి.వి.జి. సురేష్, ఉత్తర కార్యదర్శి జి. రాధాకృ ష్ణ, ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు మోహన్, దక్షిణ నాయకులు ఎం.డి. జాఫర్ అలీ, దక్షిణ కార్యదర్శి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సహకార సంస్థల బలోపేతం, పార్లమెంట్ పరిధి సమస్యల పరిష్కారంపై లోకేష్‌తో కిడారి శ్రవణ్ కుమార్ చర్చ



**పాడేరు,పెన్ పవర్,అక్టోబర్ 12:**ఈరోజు విశాఖపట్నం విమానాశ్రయంలో ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారిని మాజీ మంత్రివర్యులు, పార్లమెంట్ అధ్యక్షులు మరియు జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా గిరిజన సహకార సంస్థల అభివృద్ధి, వాటి కార్యకలాపాల విస్తరణ, గిరిజన ప్రాంతాల ఆర్థిక పురోగతిపై లోకేష్ గారితో విశదంగా చర్చించారు. అదే విధంగా పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మరియు ఉపాధి అవకాశాలపై కూడా సూచనలు ఇచ్చారు. ఐటీ శాఖ మంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తగిన ప్రాధాన్యతతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పెదవలసలో రైతుల నిరాహార దీక్షలకు పేసా కార్యవర్గం సంఘీభావం

- కాఫీ తోటల నష్టానికి న్యాయం చేయాలి:



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 12:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పెదవలసలో నేషనల్ హైవే 516ఇ నిర్మాణం కారణంగా తమ కాఫీ తోటలను కోల్పోయి జీవనోపాధి నష్టపోయిన రైతులు గత ఏడు రోజులుగా పెదవలస పంచాయతీ కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారు తమ నష్టానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా గూడెం కొత్తవీధి మండల పేసా కార్యవర్గం సంఘీభావం ప్రకటించింది. పేసా ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, కార్యదర్శులు గబ్బులంగి గణేష్ కోశాధికారి రామచంద్రుడు ఇతర పేసా కార్యవర్గ సభ్యులు కలిసి గ్రామానికి వచ్చి దీక్షలో పాల్గొంటున్న రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "రైతులు తమ కాఫీ తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. హైవే నిర్మాణం వల్ల వారు తోటలను కోల్పోయిన పరిస్థితిలో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం తక్షణమే గతంలో ప్రకటించిన నష్టపరిహారాన్ని అమలు చేయాలి. నష్టపరిహారం చెల్లించే వరకు రైతుల పోరాటానికి మేము అండగా నిలుస్తాము" అని వెల్లడించారు. పెదవలస రైతుల దీక్షలు రైతుల హక్కుల కోసం జరుగుతున్న శాంతియుత ఉద్యమంగా నిలిచాయి. ప్రభుత్వం తక్షణం స్పందించి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పేసా కార్యవర్గ సభ్యులు గుంట ధనుర్జై, జయరాం, కె. రామలింగం, కే గిరిబాబు, కె రమణ, కె బాలయ్య,జి. దొర, జి. కర్రయ్య, తగ్గి సోమరాజు,గెమ్మెల దొరబాబు,కొర్ర బాలయ్య, గ్రామ పెద్దలు కే.శరబన్న పాడల్, గాంధీ పడాల్, వసుపరి తిమోతి, లంబసింగి రమేష్,జి సత్యవతి, సిరి బాల మంగమ్మ,జి గౌరమ్మ, జి లక్ష్మి, కె రత్నకుమారి,ఎం అబ్బాయి దొర,ఎం చంటిబాబు, పంద్ర నూకరాజు,జి రమణ, తదితరులు పాల్గొన్నారు.


## ప్రకృతిని ఆరాధిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం...

- బిడ్డలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే...
- బిఎంఎస్ ప్రాంత సంఘటన మంత్రి లోవారెడ్డి



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ :12** బిడ్డలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని బిఎంఎస్ ప్రాంత సంఘటన మంత్రి లోవారెడ్డి తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది విజయదశమి ఉత్సవ వేడుకను స్థానిక గిరిజన భవన్ లో నిర్వహించారు. ఉప మండల ప్రముఖ్ పద్మరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి అతిథిగా విచ్చేసిన రాజేంద్ర పాలెంసర్పంచ్ సింహాచలం మాట్లాడుతూ... సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ స్థాపించి వందేళ్లు దిగ్విజయంగా కొనసాగడం భారతీయులందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. ప్రధాన వక్త లోవారెడ్డి మాట్లాడుతూ... పర్యావరణాన్ని ప్రకృతిని కూడా దైవంగా ఆరాధించే స్వభావం భారతీయ సంస్కృతి నేర్పింది అన్నారు. ప్రకృతి ఆరాధన పర్యావరణ పరిరక్షణలో ప్రపంచ దేశాల్లోనే భారత్ అగ్రగామిలో ఉందన్నారు. ఏ దేశంలోనూ ఏ మతంలోనూ స్త్రీకి తగిన ప్రాధాన్యత లేదని కేవలం సనాతన హిందూ ధర్మం లో మాత్రమే మాత, గోమాత, భూమాత, తులసి మాత అంటూ ఆరాధిస్తూ మహిళలను శక్తి స్వరూపాలుగా భావించి సంప్రదాయం హిందూ ధర్మం లో మాత్రమే ఉందన్నారు. సర్వేజనా సుఖినోభవంతు అనే నానుడిని నిజం చేస్తూ ప్రపంచ దేశాల శ్రేయస్సు కాంక్షిస్తూ సహాయ సహకారాలు అందజేసేది భారతదేశం మాత్రమే అన్నారు. ప్రతి ఒక్కరు సేవా భావంతో సోదర భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద నుండి వారపు సంత వరకు ర్యాలీ నిర్వహించారు.

## పేదవారి ఆకలి తీర్చే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుంటా



- వాసుపల్లి గణేష్ కుమార్
- దసరా మహా అన్నదానానికి రూ.10,000 విరాళం
- 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ చేతుల మీదుగా అందజేత

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 12 :**దక్షిణ నియోజకవర్గంలోని 39వ వార్డులో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న మహా అన్నదానానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సా ర్సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసు పల్లి గణేష్ కుమార్ రూ.10,000 విరాళం అంద జేశారు. ఈ విరాళాన్ని ఆయన ఆసీలమెట్టలోని తన కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యుల కు, వైఎస్సార్సీపీ 39వ వార్డు అధ్యక్షుడు ముజీ బ్ ఖాన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సంద ర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, కుల మత భేదాలు లేకుండా దక్షిణ నియోజక వర్గం ప్రజలు ప్రతి పండుగను ఏకతా భావంతో ఘనంగా నిర్వహిస్తారన్నారు. దసరా ఉత్సవా లు కూడా అదే ఉత్సాహంతో అంబరాన్నంటా యని చెప్పారు. పేదవారి ఆకలి తీర్చే కార్యక్ర మాలకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని, తనతో నడిచే పార్టీ శ్రేణులు కూడా సేవా కార్యక్ర మాల్లో భాగస్వామ్యమవడం సంతోషకరమన్నా రు. ముస్లిం నాయకుడు, వార్డు అధ్యక్షుడు ము జీబ్ ఖాన్ దసరా అన్నదాన కార్యక్రమంలో భాగస్వా మ్యం కావడం విశేషమని వాసుపల్లి అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, వార్డు అధ్యక్షుడు పీతల వాసు, వైఎస్సార్సీపీ నాయకులు, కమిటీ సభ్యు లు తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలంటూ మొరపెట్టుకుంటున్న పలు గ్రామాల ప్రజలు...


బస్సు ఏర్పాటుకు కృషి చేస్తానంటున్న రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్య చంద్ర.....



**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 12):**మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని నాతవరం మండలం గొలుగొండపేట గ్రామస్థులు ఆదివారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్రకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన అల్లిపూడి,వెదురుపల్లి, చిక్కుడుపాలెం గ్రామాలు కలిపి 10వేల జనాభా ఉందన్నారు. కానీ కనీసం ఒక్క ఆర్టీసి బస్సు కూడా కాని పరిస్థితి నెలకొందని వివరించారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మా గ్రామం నుంచి నాతవరంకు ఏడు కిలో మీటర్లు, మరో వైపు కోటనందూరుకు ఏడు కిలో మీటర్లు దూరంలో నిత్యం లారీలు, స్కూల్ బస్సులు తిరుగుతు ఉంటాయని, కానీ ఆర్టీసి బస్సు సౌకర్యం లేదన్నారు. ప్రజలు సరైన సమయానికి ప్రయాణించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. కావున నర్సీపట్నం నుంచి తాండవ జంక్షన్ నాతవరం మీదుగా చిక్కుడుపాలెం, గొలుగొండపేట, వెదురుపల్లి, అల్లిపూడి, కోటనందూరు, తునికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన సూర్యచంద్ర నర్సీపట్నం డిపో మేనేజర్ స్వయంగా ఫోన్లో మాట్లాడారు. మేనేజర్ సానుకూలంగా స్పందించారని సూర్యచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాసరావు,మాకిరెడ్డి వెంటరమణ, గొలుగొండపేట గ్రామస్థులు బాలరాజు, అంకంరెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కొయ్యూరు పిఎసిఎస్ గుమస్తా మృతి

సహచర సిబ్బంది, పలువురు నాయకుల సంతాపం



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ :12** :కొయ్యూరు పిఎసిఎస్ కార్యాలయంలో సుదీర్ఘకాలం గుమస్తాగా పనిచేస్తున్న డి.సత్యానంద్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం నుండి పచ్చకామెర్లతో బాధపడుతున్న గుమస్తా సత్యానంద్ ను కుటుంబీకులు రాజమండ్రి తరలించి చికిత్స అందించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఫలితం లేక మృతి చెందినట్లు తెలిసింది. గుమస్తా సత్యానంద్ మృతి పట్ల పిఎసిఎస్ అధ్యక్షుడు సుమర్ల సాంబశివరావు, డైరెక్టర్లు రీమేల చంద్రరావు, కునిశెట్టి జోగారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దుచ్చరి చిట్టిబాబు, లోత వీర్రాజు, కార్యాలయ సీఈవో కర్రి సత్యనారాయణ, సిబ్బంది కాటం రాము తదితరులు, రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## స్మార్ట్ కార్డుల పై అవగాహన కల్పిస్తున్న వీఆర్వో.





- లబ్ధిదారులకు స్మార్ట్ కార్డు పంపిణీ.
- స్మార్ట్ కార్డు వల్ల అవినీతి నిరోధించవచ్చు.
- అత్యవసర సమయంలో గుర్తింపు కార్డుగా ఉపయోగించవచ్చు.
- వీఆర్వో బిడ్డిక హరికృష్ణ.

**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్. 12. పెన్ పవర్.** మండలంలో బాలేసు పంచాయితీ గాంధ్ర గ్రామంలో ఆదివారం నాడు స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ మండంగి కళావతి ఆధ్వర్యంలో వీఆర్వో బిడ్డిక హరికృష్ణ గడప గడపకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్వో హరికృష్ణ మాట్లాడుతూ. స్మార్ట్ రేషన్ కార్డు లు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఈ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు సులభంగా తీసుకోవచ్చని దానివలన సరఫరా వ్యవస్థ వేగవంతం కావడమే కాకుండా మోసాలను అడ్డుకట్టు వేయవచ్చని,లబ్ధిదారులకు రావలసిన సరుకులు ఇతరులకు చేరకుండా నిరోధించవచ్చని,అలాగే అత్యవసర సమయములో ఈ కార్డు అధికారిక గుర్తింపుగా కూడా ఉపయోగించవచ్చని,ఆయన అన్నారు లో ముఠా ప్రాంతంలో ఆన్లైన్ విషయంలో సరైన సిగ్నల్స్ లేకపోయినప్పటికీ ప్రభుత్వం,తాసిల్దార్ ఆదేశాల మేరకు తప్పనిసరిగా సరఫరా చేయడం జరుగుతుందని కావున లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వీఆర్వో అన్నారు. ఈ కార్యక్రమానిలో గ్రామస్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పంట నమోదు ప్రక్రియ పురోగతిలో రైతులు ఈ నెల 25లోపు నమోదు చేసుకోవాలి



**వ్యవసాయ అధికారి డి.గిరిబాబు**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 12:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని రైతులు పంట నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొంటున్నారని మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు తెలిపారు. ఇప్పటివరకు 12412.5 ఎకరాల్లో సాగు జరుగగా, అందులో 9519 ఎకరాల పంటల్ని 6638 మంది రైతులు నమోదుచేసుకున్నారు. ఇంకా 2894 ఎకరాలు నమోదు కావాల్సి ఉంది. అదేవిధంగా, ఉద్యాన పంటలకూ మంచి స్పందన లభిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే 5600 ఎకరాల్లో ఉద్యాన పంటల నమోదు పూర్తయినట్లు వెల్లడించారు. పంట నమోదు చేయడం వల్ల రైతులకు పంట భీమా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వచ్చినపుడు ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలకు అర్హత లభిస్తుంది. ప్రభుత్వం అందించే ఈ ప్రయోజనాలన్నీ రైతుల వద్ద పంట నమోదు ఆధారంగానే లభ్యమవుతాయి. ఈ నేపథ్యంలో మిగిలిన రైతులు కూడా ఈ నెల 25వ తేదీలోపు తప్పనిసరిగా తమ పంటలను నమోదు చేసుకోవాలి అని ఆయన సూచించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించవచ్చని తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై భగ్గుమన్న పుష్పశ్రీవాణి.





- కూటమి ప్రభుత్వ గిరిజన విద్యార్థులపై చూపించిన కపట ప్రేమ బయటపడింది.
- ఉపముఖ్యమంత్రి బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చి ఆదుకోవాలి.
- గిరిజన శాఖ మంత్రికి విద్యాశాఖ మంత్రికి గిరిజన విద్యార్థుల సావు కేకలు వినిపించడం లేదా.
- కురుపాం నియోజక వర్గం మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి.

**గుమ్మలక్ష్మీపురం,కురుపాం అక్టోబర్ 12 పెన్ పవర్.** కురుపాం మండల కేంద్రంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి సందర్శించారు.ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పచ్చకామెర్ల బారిన పడి చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.అనంతరం ఏకలవ్య పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్ తో మాట్లాడి అక్కడ చదువుతున్న విద్యార్థుల వివరాలను అడిగి వారి ఆరోగ్యం పై తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ.ఇంత జరుగుతున్న కూటమి ప్రభుత్వానికి చలనం లేదని దీనిపై ప్రత్యేక కమిటీని వేసి విద్యార్థులకు జాండీస్ రావడానికి గల కారణాలను తెలుసుకోలేకపోతున్నారని మండిపడ్డారు.గిరిజనులకు పెద్ద పీట వేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలందరూ గాడ నిద్రలో ఉన్నారని,గిరిజన శాఖ మంత్రి గాని,విద్యాశాఖ మంత్రి గాని ఇంతవరకు పాఠశాలను సందర్శించకపోవడం గిరిజనులపై వీరికి ఉన్న కపటప్రేమ బట్టబయలైందని అన్నారు.ట్విట్టర్లో,మీడియా ముందు స్టేట్మెంట్ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు.గిరిజనులపై ప్రేమంటే చెప్పులు,దుప్పట్లు పంపించడం కాదని ఇంతమంది గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచాలని ఆమె అన్నారు.ఆమె వెంట సర్పంచులు,ఎంపీటీసీలు జడ్పీటీసీలు.వైయస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు వున్నారు.

## దామనపల్లి పంచాయతీలో వేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు

- సిసి రోడ్డు పనులకు సర్పంచ్ రామకృష్ణ ప్రారంభం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 12:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దామనపల్లి గ్రామంలో కొత్తగా చేపట్టిన సిసి రోడ్డు పనులను ఆదివారం పంచాయతీ సర్పంచ్ కే. రామకృష్ణ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పంచాయతీ అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమమే నా ధ్యేయం. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం" అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దామనపల్లి పంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి చెందించిన మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మాతే సోములమ్మ, కూటమి నుంచి ఇరవాడి సతీష్, వైఎస్ఆర్ సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**-చింతకాయల పద్మావతి**

**నర్సీపట్నం, పెన్ పవర్ (అక్టోబర్ 12) :** ప్రజల ఆరోగ్య పరిరక్షణనే ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా భావిస్తూ, సమాజ సేవలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని జోగునాదునిపాలెంలో ఆమె ఆధ్వర్యంలో, విశాఖపట్నం ప్రఖ్యాత వెంకట రమణ హాస్పిటల్ మరియు సింహాద్రి స్టీల్స్ సంయుక్తంగా ఆదివారం భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పద్మావతి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా మహిళలు గర్భసంచి ముఖద్వార క్యాన్సర్ వంటి రోగాలపై అవగాహన పెంపొందించుకుని, అందుబాటులో ఉన్న పరీక్షల ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించుకోవడం అత్యంత ముఖ్యం అని సూచించారు. వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నాము అని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. వాసుదేవ్, డాక్టర్ ఎ. కవిత ల నిస్వార్థ వైద్య సేవలను ప్రశంసిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో విశాఖపట్నం నుండి విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్. వాసుదేవ్ (జనరల్ మెడిసిన్ నిపుణుడు), డాక్టర్ ఎ. కవిత (గైనకాలజిస్ట్), డాక్టర్ సత్య, బీమ్స్ బృందం

తమ సిబ్బందితో కలిసి ప్రజలకు వివిధ వైద్య సేవలు అందించారు. సుమారు వంద మందికి పైగా స్థానికులు రక్తపోటు, మధుమేహం, సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కన్నయ్య నాయుడు, మాజీ చైర్మన్ గుడబండి ఆదిలక్ష్మి, 10వ వార్డు కౌన్సిలర్ రాజునాయుడు, డీసీసీబీ పీఏసీ డైరెక్టర్ గొల్లయ్య, 14వ వార్డు కౌన్సిలర్ వరహాలమ్మ, పెదబొడ్డేపల్లి నీటి సంఘం చైర్మన్ ఆర్. రామసత్యం,

11వ వార్డు ఇంచార్జ్ పోతురాజు అలాగే పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని స్థానికులు ఆకాంక్షించారు.

## డిగ్రీ కళాశాలకు మంచినీటి సమస్య తీర్చిన ఎంపీపీ

### సన్మానం చేసిన విద్యార్థులు హెచ్ డబ్ల్యు ఓ లు



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 12:** -చింతపల్లి గిరిజన సంక్షేమ డిగ్రీ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో విద్యార్థులతో ఎంపీపీ కోరాబు అనూష దేవి సమావేశం అయ్యారు ఈ సందర్భముగా విద్యార్థినిలు, హెచ్ డబ్ల్యు ఓ లు ఎంపీపీని ఘనంగా సన్మానించారు ఎంపీపీ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ బాలికల బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో విద్యార్థులు విద్యార్థులు నీళ్ల కోసం ఎదుర్కొంటున్న సమస్య గుర్తించి మండల ప్రజా పరిషత్తు నిధులతో రెండు బోర్లు నిర్మించామన్నారు ఒక్కొక్క బోర్ నిర్మాణానికి రెండు లక్షల చొప్పున నిధులు మంజూరు చేసామన్నారు ప్రభుత్వం కల్పిస్తున్న చనిపోయిన సద్విని చేసుకుంటూ విద్యార్థులు డిగ్రీతోపాటు పోటీ పరీక్షల్లో సిద్ధపడాలన్నారు డిగ్రీ పూర్తికాగానే పోటీ పరీక్షలు రాసి మంచి ఉద్యోగాల సాధించే కుటుంబానికి గ్రామానికి అధ్యాపకులకు మంచి పేరు తీసుకొని రావాలి అన్నారు ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ పసుపులేటి వినాయకరావు కె పద్మావతి ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి కోఆప్షన్ నాజరవల్లి తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న 66 వ వార్డు కార్పొరేటర్ కెజిఆర్



**కూర్మన్నపాలెం : పెన్ పవర్, అక్టోబర్ 12:** నాతయ్యపాలెం మర్రి చెట్టు నుంచి పెదపూడి నరసింహ మూర్తి ఇంటికి వెళ్ళే రహదారి సీసీ రోడ్ పనులను పరిశీలిస్తున్న 69 వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి నాతయ్యపాలెం గ్రామ యువత సంద్రాన వరహాల రాజు , గొల్లవిల్లి నరసింఘ రావు , జీవీఎంసీవర్క్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ , సెక్రటరీ లలిత, కాంట్రాక్టర్ గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు

- టీఎన్ టి యుసి డిమాండ్



**గాజువాక: పెన్ పవర్, అక్టోబర్ 12:** అధికారంలో ఉన్నంతకాలం గంగవరం పోర్టును అదానికి అప్పజెప్పి అనుక్షణం స్టీల్ ప్లాంట్ కర్మగారాన్ని ప్రైవేటుకరం చేయాలని దాని భూములను అమ్ముకోవాలని కుట్రపనిన ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం కోల్పోవడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఇప్పుడు ప్రైవేటీకరణ అంటూ గగ్గోలు పెడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర ఏపీ ఐఐసి డైరెక్టర్ గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు . గాజువాక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు కనిరెడ్డి ఆంజనేయ అధ్యక్షతన నియోజకవర్గ పి ఎన్ టి యు సి సమావేశంలో మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ కర్మగారాన్నే ఆదుకున్న ఘనత రెండుసార్లు కోట ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , విశాఖపట్నం శ్రీ భరత్ ఆధ్వర్యంలో సుమారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 14 వేల కోట్ల రూపాయల పైచిలుకు తీసుకువచ్చి విశాఖ ఒక్క ను పరిరక్షించాము అని అన్నారు వైకాపా నాయకులకు దమ్ముంటే ఐదేళ్ల పాలనలో విశాఖ స్టీల్ ప్లాంట్ కు మీరు చేసిన సహకారం ఏమిటో ఉక్కు ఉద్యోగులకు నిర్వాసితులకు తెలియజేయాలని అన్నారు అలాగే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పై ప్రజా అభిప్రాయమే కూటమి అభిప్రాయమని ప్రకటిస్తున్న వామపక్ష పార్టీలు వైసీపీ పార్టీకి తొత్తులుగా మారి ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గం అని అన్నారు ఈ కార్యక్రమంలో స్టీల్ టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి గాజువాక నియోజకవర్గం టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి కోన సోమనాయుడు జిల్లా టీ ఎన్ టీ యూ సి నాయకుడు నంబారు పెద్దదేవుడు గాజువాక నియోజకవర్గం టిఎన్టియుసి నాయకుడు లంక జగన్నాథం దేవర బోయిన సుబ్రహ్మణ్యం గెద్దాడ ప్రసాద్ చొప్ప నూకరాజు కోరికన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో సిఐటియు నేతలు మంత్రి లోకేష్‌ను కలిశారు

### ఆశా, అంగన్వాడీ, స్కూల్ కార్మికుల వేతన పెంపును కోరారు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 12 :** విశాఖపట్నం: ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ శానిటేషన్ కార్మికుల వేతనాలు పెంపు కోసం సిఐటియు నేతలు మంత్రి లోకేష్ ను ఈరోజు కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను చర్చిస్తూ వినతి పత్రం అందించారు.సిఐటియు నేతలు తెలిపారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో కార్మికుల వేతనాలు పెంచకపోవడం వల్ల తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రత్యేకంగా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గత మూడు నెలల వేతనాలు మరియు బిల్లులు ఇంకా చెల్లించని పరిస్థితి ఉంది.

స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు కార్మికులపై వేధింపులు చేయడం ఆపాలని, అక్షయపాత్ర భోజనం సరఫరా చేస్తున్న స్కూల్ కార్మికులకు కోడిగుడ్లు వండినందుకు, రాగి జావ కాసినందుకు ప్రత్యేక వేతనం ఇవ్వాలని, ప్రభుత్వమే నేరుగా గ్యాస్ సరఫరా చేయాలని కోరారు.

కార్మికుల భద్రత, స్వచ్ఛత కోసం ప్రతీ 100 మంది విద్యార్థులకు ఒక స్కూల్ శానిటేషన్ వర్కర్ నియమించాలని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉన్న అన్ని వర్కర్లను కొనసాగించాలని, ఏ ఒక్కరిని విధుల నుండి తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు.అలాగే, గత ఆరు సంవత్సరాలుగా అంగన్వాడీలకు వేతనాలు పెంచకపోవడం సమస్యగా ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే వేతన పెంపు చర్యలు చేపట్టాలని, అర్హులైన అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, "ప్రభుత్వ ఉద్యోగి" అన్న పదాన్ని అధికారిక వెబ్‌సైట్ నుండి తొలగించాలని కోరారు.

అంతేకాక, ఆశా కార్మికులకు కనీస వేతనాలు, వారాంతపు, సాధారణ, పండగ, మెడికల్ సెలవులు ఇవ్వాలని సిఐటియు నేతలు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి. మణి, ఎల్. దేవి, ఎస్. పద్మ, కె. బృందా, వి. మేరీ, ఆర్. శోభరాణి, కె. పద్మావతి, భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

## గజ్జనపూడిలో ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం



**ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబరు 12 :** మండలంలోని గజ్జనపూడి గ్రామంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శాంతి ఆశ్రమం సంఘ మండలానికి చెందిన ఈ కార్యక్రమానికి అమరాది బీమరాజు అధ్యక్షత వహించగా, కర్రి ధర్మరాజు ముఖ్య అతిథిగా, మొండి వీరవెంకట రమణ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. సంఘ ప్రధాన శిక్షక్ నాగేశ్వరరావు స్వామి మార్గదర్శకత్వంలో రాసంశెట్టి రాజా సంఘ ధ్వజాన్ని ఆవిష్కరించి, సంఘ ప్రార్థనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వయంసేవకులు వ్యాయామ ప్రదర్శనలు చేసి, గ్రామ ప్రధాన వీధులలో పదసంచలనం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఈ ప్రదర్శనకు చప్పట్లతో అభినందనలు తెలిపారు. కార్యక్రమం ముగింపులో స్వయంసేవకులు భక్తిపూర్వకంగా సంఘ గీతం ఆలపించి, వచ్చిన వారికి ప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమంలో స్వయంసేవకులు పద్మనాభరాజు, జువ్విన తిరుపతిరావు, చిట్రా అప్పారావు, రాసంశెట్టి సుబ్బారావు, కొల్లు సత్తిబాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 29వ వార్డులో ఉచిత వైద్య శిబిరం గౌతమ్ డెంటల్ కేర్ ప్రారంభోత్సవం

**ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో కార్యక్రమాలు విజయవంతం**





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 12 :**కన్నయ్యపేట 29వ వార్డు ప్రాంతంలో జనసేన ప్రధాన నాయకులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు పాల్గొన్నారు. ఈ శిబిరంలో మ్యాక్షి విజన్ సౌజన్యంతో కంటి పరీక్షలు, యోధ డయాగ్నొ స్టిక్ సౌజన్యంతో బ్లడ్ ప్రెషర్, షుగర్ పరీక్షలు, జనరల్ చెక్-అప్ మరియు క్లావ్ డెంటల్ క్లినిక్ సౌజన్యంతో దంత పరీక్షలు నిర్వహించబడ్డా యి. సుమారు 300 మంది ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో 29వ వార్డు ఇంచార్జి గొలగాని రవిశ్వరరావు, తెలుగుదేశం అధ్యక్షులు ఉరికిటి గణేష్, జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్, జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు స్థానికులు హాజరై విజయవంతంగా నిర్వహించారు.తర్వాత, రైల్వే న్యూ కాలనీ రోడ్లో కొత్తగా ఏర్పాటుచేసిన గౌత మ్ డెంటల్ కేర్ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ కందుల నాగరాజు కలిసి ప్రారంభిం చారు. ఆధునిక సదుపాయాలతో నందు, డాక్ట ర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి కార్యకర్తలు కలిసి ప్రజల అవసరాలను తీర్చే కార్యక్రమాలు 29 వ వార్డులో కొనసాగిస్తా రని, ప్రజల ఆరోగ్యం ప్రాధాన్యం ఇవ్వడం అనేది ముఖ్యమని అన్నారు.ద

# కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత కరువు..

- ఎంగిలి ఇస్తరాకుల మధ్య భక్తులు,స్వాములు ప్రదక్షిణ..
- పట్టించుకోని ఆలయ అధికారులు..





**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 12:** కోరిన కోర్కెలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత కరువు ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించేందుకు వచ్చిన భక్తులు, స్వాములు ఎంగిలి ఇస్తరాకులు మధ్యన ప్రదర్శన చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఇప్పటివరకు ఇలా ఎప్పుడు జరగలేదని భక్తులు వాపోయారు. రాబోయేది కార్తీక మాసం కావడంతో భక్తులు ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని ఇది ఇలాగే కొనసాగితే ఆలయానికి వచ్చే భక్తులు తగ్గే అవకాశం ఉంటుందని పరిశుభ్రత లేకపోతే అనేక రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆలయాన్ని అధికారులు పరిశు భ్రతపై దృష్టి పెట్టాలని భక్తుల కోరుకుంటున్నారు.

# నిరసన కార్యక్రమానికి తరలి రావాలి

**వైసీపీ మండల కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు**

**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:** కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 13న రంపచోడవరం నియోజకవర్గం కేంద్రంగా ఉన్న ఎక్సైజ్ కార్యాలయం ఎదుట కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంకు ప్రతి ఒక్కరు తరలిరావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అనంత బాబు , మాజీ ఎమ్మెల్యే రంపచోడవరం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని, నియోజకవర్గం లోని మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైస్ సర్పంచులు, వార్డు మెంబర్లు, పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

# ఆమె మరణం తన కుటుంబానికి"చీకటి"

- మరో కుటుంబాలలో
- "వెలుగై"నిలిచిన"అన్నపూర్ణ"
- సత్ఫలితాలు ఇస్తున్న అవయవ దానం, కుటుంబంలోని వెలుగులు నింపుతున్న కార్యక్రమాలు
- బ్రెయిన్ డెడ్ అయిన అన్నపూర్ణ నుంచి అవయవాలు సేకరించిన విమ్స్ వైద్యులు
- మరో అవయవ దానం కేసు చేసి చరిత్ర సృష్టించిన విమ్స్
- విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె రాంబాబు



**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబర్ 12 :** మరణించి కూడా నలుగురి జీవితాల్లో చిరంజీవిలా జీవిస్తున్నది ఆమె.. తన కుటుంబానికి తీవ్ర దుఃఖాన్ని నింపిన వ్యక్తి మరో నలుగురి కుటుంబాలకు మాత్రం సంతోషాన్ని పంచారు.. ఆ కుటుంబం ఆడ దిక్కును కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ ఇతరుల కుటుంబాల్లో నూతన వెలుగులు నింపాలని అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చి అందరి చేత అభినందనలు పొందుతున్నారు... వివరాల్లోకి వెళితే విశాఖ లోని విశాలాక్షినగర్ కు చెందిన కే అన్నపూర్ణ (50) శనివారం హనుమంతువక వద్ద రోడ్ క్రాస్ చేస్తుండగా ఒక బైక్ వచ్చి ఢీ కొట్టటంతో తీవ్ర రక్తస్రావం జరగటంతో విమ్స్ ఆస్పత్రికి తరలించారు.. ఆమెను రక్షించేందుకు ఆస్పత్రి వైద్య బృందం తీవ్రంగా శ్రమించారు.. అయినప్పటికీ ఆమె ఆరోగ్యం క్షీణించడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్య బృందం ప్రకటించారు.. వైద్య బృందం వారి కుటుంబ సభ్యులకు మరియు బంధువులకు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలపటంతో ఈ సమాచారాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు దృష్టికి తీసుకుని వెళ్ళగా ఆయన అవయవాలను స్వీకరించేందుకు అనుమతులను జారీ చేశారు.. అనంతరం బ్రెయిన్ డెడ్ అయిన ఆమె నుంచి లీవర్, ఊపిరితిత్తులు మరియు కార్నియా స్వీకరించారు. జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్టును అనుసరించి అవయవాలను పలు ఆసుపత్రులకు కేటాయించారు. ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ప్రజలు వారి కుటుంబ సభ్యులను అభినందించారు.

**గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు తరలింపు**

అన్నపూర్ణ నుంచి స్వీకరించిన అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్ లోని ఒక ఆసుపత్రికి తరలించారు. నగర పోలీస్ కమిషనర్ సహకారంతో ప్రత్యేక ఎస్కార్ట్ ద్వారా అవయవాలను విమానాశ్రయానికి తరలించారు. అవయవాలను తరలించే సమయంలో విమ్స్ సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు.

**విమ్స్ లో మరో అవయవ దానం..**

డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆరోగ్య రంగంలో లివర్ ట్రాన్సప్లాంటేషన్ చేసి చరిత్ర సృష్టించిన విమ్స్ ఆస్పత్రి మరో ఘనతను చేరుకుంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ ఆసుపత్రికి సాధ్యం కాని విధంగా విమ్స్ ఆస్పత్రి ఇప్పటికే ఆరు బ్రెయిన్ డెడ్ కేసులను ప్రకటించి వారి నుంచి అవయవాలను సేకరించి పదుల సంఖ్యలో నూతన జీవితాలను ప్రసాదించింది. విమ్స్ ఆస్పత్రి నందు ప్రత్యేకంగా జీవన్ దాన్ పై అవగాహన కలిగించేందుకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయటం. అవయవ దానంపై విస్తృతంగా అవగాహన కల్పించడం వల్లనే విమ్స్ ఆసుపత్రి ఈ ఘనత సాధించగలిగింది.

**అవయవ దానం చేయటం అభినందనీయం...**

-డాక్టర్ కే రాంబాబు, డైరెక్టర్ విమ్స్ మరియు జీవనదాన్ రాష్ట్ర కోఆర్డినేటర్

అన్నపూర్ణ కుటుంబం తీవ్ర దుఃఖములో కూడా ఇతరుల కుటుంబాల్లో ఆనందాలు నింపాలనే ఉద్దేశంతో అవయవ దానానికి ముందుకు రావడం అభినందనీయం. అవయవ దానంపై ఇప్పుడిప్పుడే ప్రజల్లో ఉన్న అపోహలు తొలగి అవయవాలు దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. అయినా అవయవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5000 మంది రోగులు ఎదురుచూస్తున్నారు.. ప్రతి ఆసుపత్రుల్లో కూడా జీవనదాన్ కోసం ఒక ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేస్తే బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే అవకాశం ఉంటుంది.. తద్వారా ఎంతో మందికి నూతన జీవితాలను ప్రసాదించవచ్చు.. సేకరించిన అవయవాలను గ్రీన్ ఛానల్ ద్వారా పంపేందుకు సహకరించిన పోలీస్ శాఖకు.. అవయవదానానికి ప్రోత్సహించిన వైద్య బృందానికి.. ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు

# ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తికి అప్పగించే యత్నం





**అంబేద్కర్ విగ్రహం తొలగించిన ప్రాంతంలో పిల్లల పార్క్ లేదా అంబేద్కర్ భవనం నిర్మించాలంటున్న స్థానిక ప్రజలు**

**ప్రభుత్వ స్థలంలో స్థానిక పెత్తనమేమిటి ! ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టాలంటున్న స్థానికులు**

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 12:** జీవీఎంసీ జోన్ 2 పరిధి 13 వ వార్డు రామకృష్ణాపురంలో గత నెలలో "అంబేద్కర్ విగ్రహం తొలగించన అంబేద్కర్ వారసులు"పెన్ పవర్ దినపత్రికలో వార్త ప్రచురించిన సంగతి తెలిసినదె.స్థానికులు కొందరు అంబేద్కర్ విగ్రహం తొలగించిన విషయం తెలిసిందే,, కానీ విగ్రహం తొలగించిన ప్రాంతంలోనే అంబేద్కర్ విగ్రహ పునర్ ప్రతిష్ట చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.ఆ స్థలం అమ్మకం చేశారా లేక వేరే వ్యక్తికి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారా !అనేదానికి అంబేద్కర్ విగ్రహం అక్కడనుండి యధా స్థానంలో ఏర్పాటు చేయకపోవడంపై అనుమానాలు వాస్తవమే అని దానికి బలం చేకూరుతుంది. అంబేద్కర్ విగ్రహం తొలగించి వివాదాలు కారణమైన వారిపై చర్యలు చేపట్టకపోవడం మరియు అంబేద్కర్ విగ్రహానికి శిలాఫలకాలు టైల్స్ కు వివాదాలకు కారణమైన వారిని విరాళాలు అడగడం ఎంతవరకు సమంజసం అని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ విగ్రహం తొలగించిన ప్రాంతంలో పునర్నిర్మాణం చేపట్టాలని లేదా ఆ ప్రాంతంలో పిల్లలు ఆట స్థలం పార్కు లేదా అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీన పరుచుకుని స్థలములో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని బి ఆర్ టి ఎస్ రోడ్డు కు అనుకుని ఉన్న స్థలం కావడంతో లక్షలు విలువ చేసే ఆ స్థలం పై పెద్దలు కన్ను పడడం, స్థలం పరుల పాలు కాకుండా ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ప్రజల అవసరాల మేరకు ప్రాంతాన్ని ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ వివరణ కోరగా ఈ విషయం అధికారులతో మాట్లాడడం జరిగిందని సచివాలయం సిబ్బందితో స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, స్వాధీనపరుచుకుని ప్రజాఅవసరాలు నిమిత్తం ఉపయోగించడం జరుగుతుందని.ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై లేదా అక్రమణ ప్రయత్నాలు చేసిన వారిపై చర్యలుచేపడతామని, జీవీఎంసీ అధికారులు తక్షణమే పరిశీలించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో అంబేద్కర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులు వివిధ సంఘటనలోనూ దృష్టిలో ఉంచుకొని సున్నిత సమస్యను జటిలం కాకుండా చూడాలని అంబేద్కర్ వారసులు కోరుతున్నారు.




# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పరిటాల శ్రీరామ్





**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 12:**సీతానగరం మండలంలోని మునికూడలి గ్రామంలో గల సచివాలయం సమీపంలో మాజీ సీఎం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకలు స్వర్గీయ నందమూరి తారకరామారావు వ్రిగహా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. బొబ్బిలంక వంతెన నుంచి భారీ బైక్ ర్యాలీతో రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ యువనేత పరిటాల శ్రీరామ్ నియోజకవర్గ ఎమ్మెల్యేబత్తుల బలరామకృష్ణ ముని కూడలిలో గ్రామ ప్రజలు యువనేత పరిటాల శ్రీరామ్ ను గజమాలతో సత్కరించారు , నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యువ నేత పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని నడవడికను నిలబెట్టుకున్నందుకు ప్రజలకు రుణపడి ఉంటామని అన్నారు. కూటమి ప్రభుత్వం 15 సంవత్సరాలు అధికారంలో ఉంటుందని తెలిపారు .ఏ రంగంలోనైనా తనదైన ముద్ర తో ప్రజల అభిమానాల్ని పోంది వారి గుండెల్లో చిరస్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. నియోజకవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ ఎంతో సంతోషదాయకమని సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రతి పేదవాడికి పట్టెడన్నం పెట్టిన మహా మనిషి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ కలలు గన్నఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరుస్తూ పార్టీని మరింత బలోపేతం చేశారన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా గర్వకారణమన్నారు.తెలుగు వారి గుండెల్లో ఎప్పటికీ ఉండిపోయే వ్యక్తి ఎన్టీఆర్ అని చెప్పారు.కూటమి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో. సొసైటీ అధ్యక్షులు సానేపల్లి వెంకట రామారావు, కాంద్రు శేఖర్, మద్దిపాటి సుజీరాజు, మట్టా వెంకటేశ్వరరావు, సర్పంచ్ అరుమిల్లి సత్యవతి సత్యనారాయణ, తొర్రిగెడ్డ చైర్మెన్ వేగి శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు గెడ్డం తిమ్మరావు, తెలుగు యువత అధ్యక్షుడు గుడిపాటి శ్రీనివాసరావు, కందుల బాబు, టీడీపీ సీనియర్ నాయకులు గద్దె వెంకటకృష్ణ చౌదరి, కాంద్రు శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య, వలవల రాజా, కాలగర్ల బాలకృష్ణ, బిక్కిన సతీష్ , సింగవరం సర్పంచ్ సంగన చిన పోసియ్య, మొదలగు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 2026 ఖరీఫ్ సీజన్ నాటికి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తాం





★ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 12:** 2026 ఖరీఫ్ సీజన్ నాటికి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తిచేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో స్వర్గీయ జ్యోతుల పాపారావు నీటిపారుదల పథకానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరై శిలాఫలకం ఆవిష్కరించి పథకానికి శంకుస్థాపన చేశారు. ముందుగా మంత్రి రామానాయుడుకు టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ జగ్గంపేటలో ఘన స్వాగతం పలికి బైక్ ర్యాలీగా జగ్గంపేట నుంచి మామిడాడ తీసుకువెళ్లారు. శంకుస్థాపన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. పురుషోత్తమపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఫేజ్-2 ప్రెషర్ మెయిన్ ద్వారా మామిడాడ ట్యాంక్ కు నీటి సరఫరా కల్పించేలా 3.49 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో సీతారాముడు చెరువు, జగ్గవాని చెరువు, అచ్చన్న చెరువు వంటి చెరువులకు నీరందడం ద్వారా 3,500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమౌతుంది. రాష్ట్రంలో ఏ ఇరిగేషన్ ప్రాజెక్టు చూసినా మొదలు పెట్టి, పూర్తి చేసిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబులకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 3850 కోట్లు ఖర్చు చేసి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు 738 కిలో మీటర్ల దూరంలో ఉన్న కుప్పంకు నీరందించారన్నారు. రాష్ట్రంలో 1040 లిఫ్ట్ స్కీమ్స్ ఉంటే కేవలం 140 మాత్రమే పని చేస్తున్నాయంటే 5 ఏళ్ళ జగన్ పాలనా పాపమే కారణమన్నారు. జగన్ విధ్వంసం చేసిన ఇరిగేషన్ రంగాన్ని గాడిలోపెట్టి, కీలక ప్రాజెక్టులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు చేస్తున్నామన్నారు. 2026 ఖరీఫ్ సీజన్ నాటికి పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలిస్తామన్నారు. చంద్రబాబు వాటర్ మేనేజ్మెంట్ విధానం ద్వారా రాష్ట్రంలో రిజర్వాయర్లు నిండుకుండలా కళకళలాడుతున్నాయి. వరద జలాలను సద్వినియోగం చేసుకుని చెరువులను సైతం పూర్తి స్థాయిలో నింపి, భూగర్భజలాలు పెంచేలా పనిచేస్తున్నాం. మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, కూటమి నాయకులు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు..
## తొండవరం హైస్కూల్ విద్యార్థిని మౌనిక



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 12**
రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు తొండవరం హైస్కూల్ విద్యార్థిని మంద మౌనిక ఎంపికైనట్లు హెచ్ఎం కేశవా చార్యులు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి రాణించడం ద్వారా అత్యున్నత శిఖరాలు చేరుకోవచ్చని టైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు సూచించారు. సందర్భంగా కోచ్ త్రిమూర్తులు మరియు భార్గవి శ్రీ కళ ఆద్వర్యంలో శిక్షణ పొందిన ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మౌనిక ను సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు, ఎంపిటిసి వాకపల్లి దొరబాబు, స్కూల్ చైర్మన్ ఏ.వి సుబ్బారావు, స్థానిక నాయకులు, హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

# అన్నవరం కొండపై ఉచిత దోపిడి

- ★ ఉచిత కళ్యాణమండపం పేరిట వేలకు వేలు బొకేస్తున్న బ్రోకర్లు
- ★ అయినా పట్టించుకోని అధికారులు..వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు



**అన్నవరం, పెన్ పవర్, అక్టోబర్ 12 :** అన్నవరం కొండపై వివాహం చేసుకోవాలంటే దళారుల కు భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెప్పాల్సి వస్తోంది. కొండపైన పెళ్లి మంటపం దగ్గర నుంచి పంతులు, భజంత్రీలు వగైరా లక్ష వరకు దోచేస్తున్నారు. ప్రతీ దానికి ధర నిర్ణయించే దేవస్థానం అధికారులు ఒక్క పెండ్లి విషయంలో మాత్రం ఎందుకు కఠినమైన చర్యలు తీసుకోలేకపోతున్నారో అర్థం కావడం లేదంటూ పలువురు చెప్పడం విశేషం. కొండపైన వివాహం చేసుకునే భక్తులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అనే భావనతో పెద్దాపురం కు చెందిన ఓ దాత కొన్నేళ్ల క్రితం సత్యగిరిపై ఉచిత కల్యాణ మండపం నిర్మించారు. అప్పటినుంచి పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పెండ్లి బృందాలు ఇక్కడే వివాహాలు చేసుకుంటున్నాయి. దీంతో మరికొందరు దాతలు ముందుకొచ్చి అదే ప్రాంగణంలో రెండు మూడు ఉచిత కల్యాణ మండపాలు నిర్మించారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. ఉచిత కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకుంటే పెండ్లి బృందాలకు పైసా ఖర్చు ఉండదని భావించిన కొందరు దళారులు రంగంలోకి దిగి పెండ్లి బృందాలను దోచుకోవడం మొదలెట్టారు. కొండపైకి అడుగుపెట్టగానే సీ ఆర్ ఓ కార్యాలయం దగ్గర కాచుకుని మరీ కూర్చుంటున్నారు దళారులు. అందినకాడికి దోచేయడమే కాకుండా వారిని నానా ఇబ్బందులు పాలు చేస్తున్నా అధికారులు మాత్రం కళ్ళకు గంతలు కట్టుకుని మరీ నిద్రపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇదిలా ఉండగా పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ కు చెందిన ఓ బృందం అక్టోబర్11న పెండ్లి చేసుకునేందుకు సెప్టెంబర్11న వచ్చి ఇద్దరు దళారులు అశోక్,హరి అనే వ్యక్తులను కలిసి ఉచిత కల్యాణ మండపం బుక్ చేసుకున్నారు. పంతులు,భజంత్రీలు,2 ఏసీ గదులు మొత్తం రూ. 25వేలు చెప్పగా ఒప్పుకుని అడ్వాన్స్ లు ఇచ్చేసారు. అక్టోబర్11న శనివారం రాత్రి వివాహం చేసుకున్న అనంతరం మరికొంత సొమ్ము డిమాండ్ చేయగా పెండ్లి బృందం విసిగిపోయి నేరుగా ఈవో కార్యాలయంలో పెండ్లి కుమారుడు నాగతేజ కుటుంబసభ్యులతో కలిసి పిర్యాదు చేసారు. దీనిపై స్పందించిన ఈవో సుబ్బారావు సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు.

బ్రోకర్లు, దళారుల కారణంగా అప్రతిష్ట పాలు...
అన్నవరం సత్యదేవుని ఆలయం కొండపైన ఉండే బ్రోకర్లు దళారులు కారణంగానే అప్రతిష్ట పాలు అవుతుందని పలువురు మండిపడుతున్నారు. కొండపైన అడుగు పెట్టిన దగ్గర నుంచి కిందకు దిగేవరకు అడుగడుగునా ఉంటున్నారని భక్తులైతే ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా సీ ఆర్ ఓ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో దళారులు లేకుండా చేస్తే అన్నవరం కొండ బాగుపడుతుందని మేధావులు చెప్పడం విశేషం.

## పేరుకే నీటి తొట్టె.. ఎందుకు కట్టినట్లు..?



**ఏలూరు అక్టోబర్ 12 పెన్ పవర్:** పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేసింది ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి దాహార్తిని తీర్చుకోవడానికి వచ్చిన పశువులకు ఖాళీ తొట్టెలు దర్శనం ఇవ్వడంతో దప్పికతో పశు వులువెను తిరుగుతున్నాయి వీటి నిర్వహణను పరిశీలించాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ల పర్యవేక్షణ లేమితో తొట్టెలు పళ్ళుచోట్ల మొక్కలతో రూపు కోల్పోయాయి.వీటిని తొలగించి తొట్టెలను నీటితో నింపి పశువుల పశువుల దాహార్తిని తీర్చేందుకు వినియోగంలోకి తీసుకురావాలని ఉపాధి హామీ అధికారులతో పాటు వెటర్నరీ సిబ్బందిని రైతాంగం కోరుతున్నారు.

## ఎందుకు ఇచ్చారో.. ఎక్కడున్నాయో..?

వైకాపా పాలనలో విద్యార్థులకు అందజేసిన ట్యాబులు కనుమరుగు



**ఏలూరు అక్టోబర్ 12 పెన్ పవర్ :** గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం భావి పౌరులుగా ఎదగాల్సిన వారిని డిజిటల్ తెరకు అతుక్కుపోయేలా చేసింది. రూ. కోట్ల వ్యయంతో విద్యార్థులకు బైజుస్ సాంకేతిక పరిజ్ఞానం పేరిట అందించిన ట్యాబ్లు చదువుకు ఆటంకం కలిగించడంతోపాటు ప్రస్తుతం అవి కనిపించడం లేదు.

2022-23 విద్యా సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల పరిధిలోని జెడ్పి ఉన్నత పాఠశాలలతో పాటు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు,వారికి పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబులను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులకు ఉపాధ్యాయులకు వీటిని అందించారు. బైజుస్ సంస్థతో ఒప్పందం చేసుకొని అరకొర పాఠ్యాంశాలను అప్లోడ్ చేశారు.అన్ని సబ్జెక్టులను టాబ్ లో అప్లోడ్ చేయకపోవడం, చేసిన వాటిల్లో కొన్ని పాఠ్యాంశాలను పొందుపరచకపోవడం, నమోదు చేసినవి పూర్తిస్థాయిలో లేకపోవడం, తదితర కారణాలతో డిజిటల్ బోధన కుంటుపడినట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కొన్నాళ్లకు అవి పని చేయకపోవడంతో అటకెక్కించారు. పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు పుస్తకాలు పక్కన పెట్టి ఆ ట్యాబుల్లో వీడియో గేమ్స్ లోడ్ చేయించుకుని సమయాన్ని దుర్వినియోగం చేసుకున్నారు

**స్వప్రయోజనాలకు వాడుతున్నారా..?**
వైకాపా ప్రభుత్వం అందించిన ట్యాబ్లు నేడు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఇచ్చినవి వారి వద్దనే ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు, కానీ ఇందులో స్పష్టత లేకపోవడంతో వాటి జాడ తెలియని పరిస్థితి. వాటిని వారి కుటుంబ సభ్యులు స్వప్రయోజనాలకు వినియోగిస్తున్నట్లు సమాచారం. రూ.కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన వాటిని విద్యాశాఖ తిరిగి స్వాధీనం చేసుకుని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని పలువురు సూచిస్తున్నారు. ఆ విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

## ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి-సువర్ణ రాజు



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 12 :**ఆపదలో ఉన్న వారిని ఆదుకుని మానవత్వాన్ని చాటుకోవాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు.నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకులు కోడెల్లి నాగేంద్ర ప్రమాదానికి గురయ్యారు.విషయం తెలుసుకున్న జనసేన నాయకులు ఆ గ్రామ పార్టీ అధ్యక్షులు దొండపాటి బాబు అధ్వర్యంలో బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.జనసైనికులు సహకారంతో సేకరించిన 15 వేల రూపాయల నగదు,రెండు బస్తాల బియ్యాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని జనసైనికులు ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు.ఎక్కడ ఎవరికి ఏ ఆపద సంభవించిన వెంటనే స్పందించి ఆదుకోవడం తమ పార్టీ జనసైనికులకు వెన్నతో పెట్టిన విద్యగా మారిందన్నారు.ఇటువంటి విషయాల్లో ఔదార్యాన్ని కనబరుస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందించడం అభినందనీయం అన్నారు.జనసేన నాయకులకు పార్టీ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.ఇటువంటి సహాయ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్న జనసైనికులను అభినందించారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు చోడసాని బాపిరాజు,సింగరాజుపాలెం గ్రామ సర్పంచ్ గద్దె బాలగంగాధర్ తిలక్,నల్లజర్ల సొసైటీ డైరెక్టర్ గుడిసె శివకృష్ణ,మండల పార్టీ కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు,నాయకులు గుండాబత్తుల వరుణ్ కుమార్,దొండపాటి సతీష్,కోమలి వెంకన్న,దొండపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దుర్గేష్ ను కలిసిన జనసేన నాయకులు



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 12 :**రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ను నియోజకవర్గంలోని నల్లజర్ల మండలం తెలికిచెర్ల గ్రామ సర్పంచ్ బండి చిన్న నాగరాజు,జనసేన నాయకులు,జిల్లా చిరంజీవి యువత సహాయ కార్యదర్శి రుద్ర శ్రీనివాస్ లు కలిశారు.మంత్రి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు వీరిరువురు తెలిపారు.నియోజకవర్గంలోని జనసేన పార్టీ స్థితిగతులు జనసేన నాయకులు పార్టీ అభివృద్ధికి చేసిన కృషి నియోజకవర్గంలోని పలు సమస్యలు వంటి వాటిపై చర్చించినట్లు మీరు తెలిపారు.ఈ సమావేశం అత్యంత ఉల్లాసంగా జరిగిందని పలు విషయాలపై మాట్లాడినట్లు సర్పంచ్ నాగరాజు,శ్రీనివాస్ లు తెలిపారు.

## నకిలీ మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ నేడు ధర్నా.



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 12 :**నకిలీ మద్యం విక్రయాలను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ రాష్ట అధ్యక్షుడు వై ఎస్ జగన్ మోహనారెడ్డి,రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్
ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపు మేరకు సోమవారం నిరసన ర్యాలీ,సదస్సు
కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ మండలపార్టీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ ఆదివారం పిలుపునిచ్చారు. కూటమి పాలనలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తిన్నప్పటికీ టీడీపీ ప్రభుత్వ తీరు మార్చుకోకపోవడాన్ని నిరసిస్తూ, అక్రమ మద్యం విక్రయాలను నిరసిస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి కపిలేశ్వరపురం
మండలం లోని వైసీపీ పార్టీ
అన్ని గ్రామాల
ప్రజాప్రతినిధులు,గ్రామాల నాయకులు, ఎస్సీ సెల్, బీసీ సెల్, విద్యార్థి విభాగం,యువజన సంఘాల కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సోమవారం
ఉదయం 10 గంటలకు మండపేట విజయలక్ష్మి నగర్‌లోని వైసీపీ కార్యాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమై, అక్కడి నుండి ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లి నిరసన తెలియజేస్తారని తెలిపారు.

## శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం ఊరేగింపు..

- కేరళ డప్పు వాయిద్యాలతో బూరుగుపూడి గ్రామంలో కోలాహలం..





**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 12:** బూరుగుపూడి గ్రామంలో శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం,గజస్తంభం ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో కేరళ డప్పు వాయిద్యాలతో గ్రామంలో సందడి నెలకొంది.మహిళలు భక్తులు ఘనంగా ఊరేగింపు కార్యక్రమం పాల్గొన్నారు. వైయస్సార్సీపి మాజీ వ్యవసాయ శాఖ నెంబర్ కంటే వినయ్ తేజ, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా సిటీ తెలుగుదేశం పార్టీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- సిటీ ఎమ్మెల్యే వాసు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్,12:** తెలుగుదేశం పార్టీ లోని నాయకులు, యువకులను ఉత్సాహ పరిచేందుకే తాము క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. క్రికెట్ అభిమానులు, స్థానిక నాయకులు, కార్యకర్తల కేరింతల మధ్య వాసు బ్యాట్ మొదటి బంతిని ఆడి క్రీడాకారులకు ఉత్సాహ పరిచారు. సుమారు 10 రోజుల పాటు పేపరు మిల్లు సమీపంలోని లూథరగిరి మైదానంలో జరగనున్న రాజమండ్రి సిటీ తెలుగుదేశం పార్టీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ , పార్టీ కోసం పని చేస్తూ, ప్రజా క్షేత్రంలో ఉంటూ ఒత్తిడికి గురయ్యే తమ పార్టీ నాయకులను ఉత్సాహ పరచడం కోసం, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిచడం జరుగుతోందన్నారు. క్రీడలు సమాజ అభివృద్ధిలో, ఆరోగ్య సంరక్షణలో, యువతకి స్ఫూర్తి కల్పించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, సామాజిక విలువలు, , జీవన నైపుణ్యాలు అలవడతాయన్నారు. ప్రభుత్వం కూడా క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గంగవరంలో మండల స్థాయి గ్రీవెన్స్

- తాసిల్దార్ శ్రీనివాస్



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 12:**ప్రతీ సోమవారం మండల స్థాయిలో గ్రీవెన్స్ (ప్రజా సమస్యల పరిస్కార వ్యవస్థ) నిర్వహించడం జరుగుతుందని గంగవరం తహసిల్దార్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, గంగవరం నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ గ్రీవెన్స్ నందు అందరూ మండల స్థాయి అధికారులు పాల్గొనాలని. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు గ్రీవెన్స్ దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఎస్సీల సంక్షేమానికే ఖర్చు చేయాలి

- ప్రైవేటు పరిశ్రమలు స్థానికులకు 70 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు డిమాండ్



**రాజమహేంద్రవరం , పెన్ పవర్,అక్టోబర్ 12 :** రాష్ట్రంలోని దళితుల సంక్షేమానికి , అభివృద్ధికి దోహదం పడేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఇతర సంక్షేమ పథకాలకు దారి మళ్లించకుండా ఎస్సీల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తూర్పుగోదావరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉందుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యటనలో భాగంగా నగరానికి విచ్చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, రాయితీలు పొందుతూన్న ప్రైవేటు పరిశ్రమలు స్థానికులకు 70 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ద్వారా పార్లమెంట్ లో చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు జరగక యువతకు ఉపాధి లేక నిరుద్యోగులు పెరుగుతున్నారన్నారు. ప్రైవేటు రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిన కల్తీ మద్యం అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యం తాగి ప్రజలు కిడ్నీ ,లివర్, ఉదర వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం తయారీ, అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ, కొన్ని తీర్మానాలు ఆమోదించినట్లు వివరించారు. వీటిలో ఎస్సీ వర్గీకరణ కు కేంద్ర, రాష్ట్రాలు చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ఉద్యోగాలలో ఎస్సీ బి క్యాటగిరీకి చెందిన 1,633 మంది ఉద్యోగాలు పొందడానికి వర్గీకరణ అమలే నని హర్షం చేస్తూ తీర్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఆర్పిఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షులు తలారి నాని మాదిగ, కోనసీమ జిల్లా అధ్యక్షులు కన్నిపాముల శ్రీనివాస్ మాదిగ, తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి బొచ్చు చినబాబు మాదిగ, గుంటూరు జిల్లా ప్రతినిధులు కళ్యాణి జార్జి మాదిగ, కందుల జార్జ్ మాదిగ, వెంకట్ మాదిగ, రామచంద్రాపురం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ దోమ్మలపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సత్య దీక్ష వస్త్రముల పంపిణీ



**అన్నవరం, పెన్ పవర్, అక్టోబర్ 12 :** అన్నవరం సత్యదేవుని దీక్షకు సంబంధించి దీక్ష వస్త్రములను దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు చేతుల మీదుగా చైర్మన్ కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 13 వరకు 27 రోజులపాటు ఆచరించనున్న సత్య దీక్ష మాల ధారణకు సంబంధించి పసుపు రంగు వస్త్రములను దేవస్థానం సరఫరా చేస్తోంది. సత్యదీక్షను ఆచరించేందుకు ఆసక్తి చూపే గిరిజన ప్రాంత ప్రజలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు దేవస్థానం ఈ విధంగా సహకారాన్ని అందిస్తుంది. సత్యదీక్షను రాష్ట్ర నలుమూలల వ్యాపింప చేసే విధంగా తగు చర్యలు తీసుకునేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. అన్నవరం సత్యదేవుని దీక్ష ఆచరిస్తే సర్వ పాపాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పూర్వీకుల ఉవాచ.

ఆజాద్ హయాంలో అన్నవరం కొండ పసుపుమయం... అన్నవరం దేవస్థానంలో అధికారుల దగ్గరికి నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు సుమారు నాలుగు వందల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. రెండేళ్ల క్రితం ఇక్కడ ఈవోగా పనిచేసిన చంద్రశేఖర్ ఆజాద్ దేవస్థానంలోని ప్రతి ఉద్యోగి సత్యనారాయణ స్వామి దీక్షను ఆచరించాలని ప్రతి ఒక్క భక్తునికి ఆదర్శంగా సత్యదీక్ష ధరించేలా ప్రోత్సహించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆజాద్ హయాంలో ప్రతి ఒక్కరూ సత్యదీక్షను ధరించి అన్నవరం కొండను పసుపుమయం చేశారు. తర్వాత వచ్చిన అధికారులు సత్యదీక్షపై ప్రచారం చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు అలసత్వాన్ని కూడా ప్రదర్శించారనే విమర్శలు కూడా లేకపోలేదు. గత ఏడాది దేవస్థానం ఉద్యోగుల్లో సత్య దీక్ష ధరించిన వారు సగం మంది కూడా లేకపోవడం విశేషం.

**సత్య దీక్ష ప్రచారంపై అధికారుల నిర్లక్ష్యం...**

ప్రతి ఒక్కరు సత్యదీక్షను ధరించేలా ప్రోత్సహించి వారిలో అవగాహన కల్పించేలా ఊరూరా సత్య రథంపై అధికారులు ప్రచారాన్ని నిర్వహించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రచారాన్ని కనుమరుగు చేసేసారు. భక్తి ఉంటే భక్తుడే దీక్షను ధరిస్తాడులే? అన్న చందాన అధికారులు నిమ్మకుండిపోతున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం ప్రారంభమవుతుండడంతో సత్య దీక్షపై దేవస్థానం అధికారులు అన్నవరం పరిసర గ్రామాలు నియోజకవర్గాల్లో ఏ విధంగా ప్రచారాన్ని నిర్వహిస్తారో.. ఎంతమంది సత్యదీక్షను ఆచరించేలా ప్రోత్సహిస్తారో.. వేచి చూడాలి.

# సత్యసాయి త్రాగునీటి పథకానికి నిధులు విడుదల చేయాలి

- సత్యసాయి కార్మికులు వేడుకోలు

**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 12 :** ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందిస్తూ వారి ఆరోగ్యాలను కాపాడుతున్న సత్యసాయి త్రాగునీటి పథకాన్ని నిర్వీర్యం చేయకుండా పథకం కొనసాగేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని నిరూపించుకోవాలని సత్యసాయి త్రాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.గతంలో తమకు రావాల్సిన 21 నెలల జీతాల కోసం 35 రోజులు నిరసన దీక్షలు చేసినప్పుడు సంబంధిత మంత్రి పవన్ కళ్యాణ్ కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని ఆ కోటి రూపాయలు ఇప్పటికీ విడుదల కాలేదని, కుటుంబాలు గడవడం కష్టంగా ఉన్నప్పటికీ విధులకు హాజరవుతూ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని సరఫరా చేస్తున్నామని అన్నారు.అయితే ఫిల్టర్ ప్లాంట్ లో నీటిని శుద్ధి చేసేందుకు ఉపయోగించే 'ఆలమ్'లేకపోవడంతో గత నాలుగు రోజులుగా నీటిసరఫరా నిలిచిపోయిందని ప్రభుత్వం కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని కార్మికులు చెబుతున్నారు.కూటమి ప్రభుత్వం వస్తే తమ బ్రతుకులు మారతాయని ఆశిస్తే తమ ఆశలు అడియాశలు అయ్యాయని, జిల్లాలో పథకానికి 12 కోట్ల రూపాయలు బకాయి ఉందని ఇప్పటికైనా మంత్రి పవన్ కళ్యాణ్ సత్యసాయి త్రాగునీటి పథకానికి నిధులు విడుదల చేసి ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని నిరూపిస్తారని ఆశాభావంతో ఉన్నామని కార్మికులు చెప్పారు.




# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం





- 300 మందికి వైద్య సేవలు

**గంగవరం /రంపచోడవరం ,పెన్ పవర్, అక్టోబర్ 12 :**రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల అధ్వర్యంలో సిరిగిందలపాడు లో ఆదివారం ప్రత్యేక వైద్య శిభిరం నిర్వహించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిభిరం లో రామకృష్ణ మిషన్ క్యాంప్ ఇంచార్జి,స్వామి లోకమయనంద మహారాజ్ పాల్గొని వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస, డాక్టర్ ఎస్. సంపత్ కుమార్ ,డాక్టర్ ఉమా మహేష్ పాల్గొని సుమారు 300మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు. అవసరం అయిన వారికి 65మందికి రక్తపరీక్షలు, 13మందికి థైరాయిడ్ పరీక్షలు నలుగురికీ ఇ.సి.జి లు ,10 మందికి ఎక్స్ రే, లు , 12,మందికి ఫిజియథెరపీ లు చేసినట్లు స్వామీజి తెలిపారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహించి 90,మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరము అయిన వారికి 27మందికి కళ్లజోళు . 18,మందిని కంటి ఆపరేషన్లు నిమిత్తం వెమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి కి తరలించారు.రామ కృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలనిస్వామీజీ కోరారు. రోగులకు, సహాయకులు కు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.ఈ వైద్య శిబిరంలో పరమహంస యోగానంద ప్రోగ్రాం మేనేజర్ చంటి బాబు,, క్యాంప్ కో - ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ 2.0 తో ప్రజలకు ఆర్థిక ఊరట : కాశి నవీన్ కుమార్ ప్రచారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబర్ 12:**ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన సూపర్ జీఎస్టీ 2.0 అమలుతో ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలు, దైనందిన అవసరాలపై ధరలు గణనీయంగా తగ్గి, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రెండవ వార్డులో కూటమి పార్టీలు కలిసి సూపర్ జీఎస్టీ %-% సూపర్ సేవింగ్స్ ప్రజా ప్రచార కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా పోస్టర్లు పంచుతూ, కొత్త జీఎస్టీ విధానం వల్ల ప్రజలకు కలిగే లాభాలను వివరించారు.వార్డు ఇంచార్జి సలాది ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాశి నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, సూపర్ జీఎస్టీ 2.0 అమలు వల్ల దేశంలోని ఉత్పత్తి రంగం, వాణిజ్య రంగం మరింత బలపడుతున్నాయన్నారు. ధరల నియంత్రణతో పాటు పారదర్శక పన్ను విధానం చిన్న వ్యాపారులు, ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, నాగమణి, భద్రరావు, నాగు, జనసేన నాయకుడు ఆది బాబు, రమణమ్మ తదితరులు పాల్గొని, ప్రజలకు సూపర్ జీఎస్టీ 2.0 ప్రయోజనాలను తెలియజేశారు.

# జిల్లాకలెక్టర్,ఇచ్చిన ఆదేశాలప్రకారం సిసి రహదారి వేయాలి.




GOVERNMENT OF ANDHRA PRADESH
DISTRICT WATER MANAGEMENT AGENCY ASR DISTRICT
PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR & DPC MGNREGS ASR DISTRICT
PRESENT: SRI. SUMIT KUMAR I.A.S.

Proc .NO.1/DWMA-ASR/2024/PR Dated: .02.2024

Sub: DWMA, ASR District- MGNREGS convergence works- line estimates and Works proposals Providing CC Roads in V.R.PURAM Mandal -11 Works Proposals Submitted by Executive Engineer (EE) ,Tribal Welfare Chintoor & Project Officer,ITDA,Chintoor for Administrative sanction- Sanction Orders Issued.
Read:1.RC.No.A4/174/2023 Dt:09-02-2024 of the Project Officer,ITDA , Chintoor.
2.Lr Rc.No. /2024/TW Division /CNTR/MoM/Dt: 31-01-2024 of the Executive Enginner (EO) ,Tribal Welfare , Chintoor.

ORDER.

In the references 1st and 2nd read above the Executive Enginner (EE), Tribal Welfare, Chintoor has submitted line estimates , works proposals with request letter of the Project Officer ITDA Chintoor for obtaining Administrative Sanction from the competent authority.

Details are as shown below.

| Sl No. | Name of the Gram Panchayat | Name of the work | Length in Meters | Estimate cost Lakhs |
|---|---|---|---|---|
| 1 | Rekhapalli | Providing CC Road from R & B Road Vadde Satyanarayana House to Kalli Chinna Muthyalu House | 168 | 7.50 |
| 2 | Rekhapalli | Providing CC Road from Katti Boyina Sathayya House to Nupa Nageswara Rao House | 214 | 9.50 |
| 3 | Rekhapalli | Providing CC Road from Rekhapalli Saibaba Temple to Revu Poshi House | 145 | 6.50 |
| 4 | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 5 | Rekhapalli | Providing CC Road from Modem Naresh House to Anganwadi Centre | 100 | 4.50 |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | 10.00 |

★ ఎన్.ఆర్.ఈజీ.ఎస్.ద్వారా సిసిరహదారి మంజూరు
★ వై.యస్.ఆర్.సి.పి.మండల నాయకులు

**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.12:**మండలంలోని రేఖపల్లి పంచాయతీపరిధిలోని గొల్లగూ డెం గ్రామానికి ఎన్.ఆర్.ఈజీ.ఎస్.ద్వారారహదారి మం జూరు,కావడం జరిగింది.ఆరహదారును మోడెంనరేష్, గృహము నుండి అంగన్వాడి సెంటర్,వరకువేయవలసి ఉన్నది.ఎన్.ఆర్.ఈజీ.ఎస్.ద్వారా వచ్చినరహదారి జిల్లా కలెక్టర్,ఇచ్చినఆదేశాలప్రకారం మోడెంనరేష్,గృహము నుండి అంగన్వాడి సెంటర్,వరకువందమీటర్లు సిసిరహ దారి వేయవలసిఉన్నది.జిల్లా కలెక్టర్,ఇచ్చినఆదేశా లను ఐటిడిఏ,ఏ.ఈ.డి.ఈ.లు పాటించకుండా సిపిఎం పార్టీకు సంబంధించిన నాయకులమాటలు వినిరూల్స్,కువిరు ద్ధంగా రహదారును సిపిఎం పార్టీకుచెందినగిరిజనేతర కాంట్రాక్టర్,తో సి.సి.రహదారి నువేయాలని,ప్రయత్నాలు చేస్తున్నారని,పంచాయతీకు సంబంధంలేని,సిపిఎం పార్టీ ప్రజాప్రతినిధులను పిలిచి,రహదారి శంకుస్థాపనకు కొబ్బ రికాయలు కొట్టడం ఏమిటి?అని రేఖపల్లిఎంపీటీసీ బంధం విజయలక్ష్మి,ప్రశ్నించారు.జిల్లా కలెక్టర్,ఇచ్చిన ఆదేశాల ప్రకారం సంబందితఅధికారులు వెంటనే మోడెం నరేష్, గృహమునుండి అంగన్వాడి సెంటర్,వరకురహదారివే యాలని,వేయలేని పక్షంలో రహదారి విషయంపై ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి వారికి జిల్లాకలెక్టర్,కుసంబంధిత విజి లెన్స్,అధికారులకు పిర్యాదు చేస్తామని,ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెం బర్లు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విభాగంజిల్లా అధ్యక్షులు బొడ్డుసత్యనారాయణ,జిల్లాఅధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ,మండలనాయకులు వడ్డానపు చిన్న రాజారావు, మోడెంనరేష్,స్థానిక గ్రామస్తులు చింత వెంకటేశ్వర్లు,మో డెంవెంకటేశ్వర్లు,మేకలమాధవరావు,గూడెం భద్రరావు, మోడెంపిచ్చయ్య,బేతిసారయ్య,కొల్లుబోయిన కన్నం రాజులు,మోసంసంజీవరావు,రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# స్టాలిన్ బాబుకు వైసీపీ శ్రేణుల శుభాకాంక్షలు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 12:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన నేలపూడి స్టాలిన్ బాబును అంబాజీపేట లోని ఆయన స్వగృహం వద్ద పలువురు నేతలు అభినందించారు. ఈ సందర్భంగా స్టాలిన్గా మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భవిష్యత్తులో రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు వైసీపీ శ్రేణులు సమాయత్తమవ్వాలని రాష్ట్రంలో ఏర్పడిన కోటని ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య అంతం చేయాలని అన్నారు. స్టాలిన్ బాబును అభినందించిన వారిలో అంబాజీపేట మండల పార్టీ అధ్యక్షులు విత్తనాల ఇంద్రసేకర్ అంబాజీపేట ఎంపీపీ వెంకటేశ్వరరావు,వక్కలంక సర్పంచ్ వాసంశెట్టి పెదబాబు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు దొమ్మేటి సత్య మోహన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు ముత్తాబత్తుల ప్రశాంత్ కుమార్, నరేంద్రపురం మాజీ ఎంపీటీసీ సభ్యులు నేలపూడి సత్యనారాయణ, సీనియర్ నాయకులు మైలె ఆనందరావు, అయినవిల్లి మండల పార్టీ నాయకుడు మిండగుదిటి రాంబాబు, ఎల్లమెల్లి జయబాబు,కాంద్రేగుల దుర్గ, కాకర కృష్ణ కాంత్,చప్పిడి పండు, కుడుపూడి సత్తిబాబు, మట్టపర్తి యజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, గోసంగి కుమారస్వామి,, జయంతి నగర్ యువసేన నాయకులు సాధనాలు బాలకృష్ణ ఇసుక పట్ల శ్రీనివాసరావు ముత్తా బత్తుల శేఖర్, నేలపూడి సుందరయ్య,తరపట్ల నాగేశ్వరరావు,పులమకూర మల్లేశ్వరరావు, గోసంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ప్రమాద అంచున ప్రయాణం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, అక్టోబర్ 12 :** ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న అంతే సంగతులు పొరపాటున జారితే ప్రమాదం చోటు చేసుకున్నట్లే. కల్వర్టుకి ఏ టువైపు పడిన గాని గాయాలు పాలు కావాల్సిందే. భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. జీలుగుమిల్లి నుండి వంక వారి గూడెం వెళ్లే రహదారి దుస్థితి. ఏ మాత్రం చిన్నపాటి వర్షం వచ్చిన ఈ కల్వర్టు పై నుండి వర్షపు నీరు ప్రవహిస్తోంది. కల్వర్టు కొట్టుకుపోయి సుమారు రెండు నెలలు కావస్తున్నా గాని పట్టించుకునే నాధుడు లేరని వాపోతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం పాదాచార్యులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు తిరుగుతూ ఉంటాయి. పెద్ద ఎత్తున గండిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రహదారి గుండా వంకావారిగూడెం, దాట్లవారిగూడెం, పాత చీమల వారి గూడెం గ్రామాలకు చెందిన రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇకనైనా నాణ్యతతో, పటిష్టంగా కల్వర్టును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

# బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



● మంత్రి ఎస్.సవిత, ఎమ్మెల్యే ముప్పిడి



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 12:**తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదివారం కొవ్వూరు నియోజకవర్గంలో శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పర్యటన నేపథ్యంలో చాగల్లు, తాళ్లపూడి మండలాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.4,50,500 విలువైన చెక్కులను మంత్రి చేతుల మీదుగా కొవ్వూరులో అందజేశారు. అనంతరం మంత్రి సవిత వాడపల్లి గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహం, మహాత్మా జ్యోతిరావు పూలే(ఎం.జే.పి) గురుకుల పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఎం.జె.పి గురుకుల పాఠశాలలు స్థాపన జరుగుతోందని పేర్కొన్నారు. వాడపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతోందా? మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కావడంతో గురుకుల పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, మరింత మెరుగ్గా పౌర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. స్త్రీ శక్తి వంటి మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం పథకాలతో ప్రయోజనం పొందుతున్నామంటూ మహిళలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. విద్యార్థుల భద్రతకు, ఆరోగ్య సంరక్షణకు పెద్ద పీట వేసే క్రమంలో ప్రతి వసతి గృహం, పాఠశాలల్లో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి సవిత తెలియ చేశారు. విద్యార్థులకు ప్రతి వారం వైద్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడేందుకు కాయిన్ బాక్స్ ఫోన్ సౌకర్యం కల్పించాం అని తెలిపారు. ఈ సమయంలో కొందరు విద్యార్థులతో ఫోన్ ద్వారా వారి తల్లిండ్రులతో మాట్లాడించడం జరిగింది. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న ఈ గురుకుల పాఠశాలకు త్వరలో స్వంత భవనం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల అంచనాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సమయానుకూల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీవో రాణి సుస్మిత, బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, ప్రిన్సిపల్ వి.ఆనంద్ రాజ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



**పెద్దాపురం, పెన్ పవర్, అక్టోబర్ 12 :** భక్తుల పాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. భక్తుల సౌకర్యార్థం వారం వారం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. అలాగే భవిష్యత్తులో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ రమణ, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసరావు ను పరామర్శించిన

వైసిపి నాయకులు



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబరు12:** మండలంలోని పుల్లేటికుర్రు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిల్లా శ్రీనివాసరావు ను పలకరించి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. పి.గన్నవరం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తోపాటు నాయకులు ఇరుసుమండ గ్రామ శాఖ అధ్యక్షులు దొమ్మేటి రాధాకృష్ణ, బీర సురేష్ ,దేవరపల్లి గౌతమ్, వస్క రామారావు , తదితరులు పాల్గొన్నారు...

# గోగుబాక గ్రామంలో శ్రమదాన కార్యక్రమం

● స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న నెల్లిపాక పంచాయతీ ప్రజలు..





**ఎటపాక,పెన్ పవర్,అక్టోబర్ 12:**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని గోగుబాకలో నెల్లిపాక గ్రామ పంచాయతీకి ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమాన్ని ఆదివారం తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్, సర్పంచ్ కొరస భద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు, గోగుబాక గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను, చెత్త కుప్పలను, మురుగునీరు పోవడానికి కచ్చా డ్రైన్ తవ్వకం వంటి పనులను 200 మంది గ్రామస్తులతో శ్రమదాల కార్యక్రమాన్ని నిర్వహించారు, అనంతరం ఈ శ్రమదాన కార్యక్రమంలో పాలుపంచుకున్న గ్రామస్తులకు ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నలజాల శంకర్రావు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు కూడా చేశారు,ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజలి పి ఈ ఎస్ ఏ ఉపాధ్యక్షురాలు దివ్య పంచాయితీ కార్యదర్శి ప్రసాదు, ఫీల్డ్ అసిస్టెంట్ వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్నిజయప్రదం చేయండి

● ఆదివాసి గిరిజనసంఘం మండలనాయకులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.12** మండలంలోని రేఖపల్లి గ్రామంలోఆదివారం ఆదివాసి గిరిజనసంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వ హించారు.అనంతరం పదమూడవ తారీకున జరగబోవు ముట్టడి కార్యక్రమాన్ని ఆదివాసి ప్రజానికం నిరుద్యోగ యువతఅధిక సంఖ్యలో పాల్గొని,జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజనసంఘం మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్,రేఖపల్లి పీసా కమిటీసభ్యులు సారా పాండురాజు,వేటగాని సూరిబాబు, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముం దు ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలు స్థానిక గిరిజనులతోనే భర్తీ చేస్తామని,హామీఇచ్చిఅధికా రంలోకి వచ్చినప్పుడు హామీని మరిచి ఆదివాసినిరుద్యో గులకు తీవ్రమైన అన్యా యం చేసిందని,వారు విమర్శిం చారు.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీలో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసిందని ఏజెన్సీ పోస్టులన్నీ కూడాప్రభుత్వం ఆదివాసి ప్రజలు ఓట్ల కోసమే హామీలు ఇస్తున్నారని,వారి సంక్షేమం కోసంఉద్యోగులకోసం వాటిని నెరవేర్చడంలేదని,వారు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అన్నిశాఖలకు సంబందించిన ఉద్యోగాల్లో ఆదివాసుల తోనే భర్తీ చేస్తామని,హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వంతక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కమిటీ సమావేశంఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రాంతంలోవంద శాంతం ఉద్యోగాలు ఆదివాసులతోనే భర్తీ చేసే విధంగా ఆర్డినెన్స్, తీసుకొచ్చి ఉద్యోగ నియామక చట్టంచేయాలని వారు డిమాండ్ చేశారు.

# మళ్లీ ఇండియాపై పడి ఏడుస్తున్న యూనస్




**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ (ప్రధాన సలహాదారు) మొహమ్మద్ యూనస్ మరోసారి భారత్‌ను లక్ష్యంగా చేసుకుని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరుగుబాటు ద్వారా అధికారాన్ని కైవసం చేసుకున్నప్పటి నుంచి భారత వ్యతిరేక వైఖరితో వ్యవహరిస్తున్న యూనస్, తాజా ప్రకటనలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నారు. చైనా, పాకిస్తాన్‌లతో స్నేహాన్ని పెంచుకుంటూ, భారత్‌పై ప్రతీకార ధోరణిని ప్రదర్శిస్తున్న యూనస్, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసకు సంబంధించిన వార్తలను తీవ్రంగా ఖండించారు.

**“హిందువులపై దాడులు భారత్ సృష్టించిన ఫేక్ న్యూసే”**

ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్‌లోని హిందూ మైనారిటీలపై హింసాత్మక సంఘటనలు జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు, ఫోటోలు వైరల్ అయ్యాయి. అయితే, యూనస్ ఈ వార్తలను పూర్తిగా తోసిపుచ్చారు. “ప్రస్తుతం ఇండియా స్పెషాలిటీల్లో ఫేక్ న్యూస్ ఒకటిగా మారింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల వార్తలన్నీ భారత్ సృష్టించిన ఫేక్ న్యూస్.” అని ఆయన విమర్శించారు. అంతేకాకుండా, సరిహద్దు వివాదాలు లేదా స్థానిక సమస్యలపై ఇరు దేశాల మధ్య అభిప్రాయభేదాలు సాధారణమేనని, వాటికి మతం రంగు పులమకూడదని యూనస్ అన్నారు. తమ ప్రభుత్వం అన్ని మతాల ప్రజల భద్రతకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

**అంతర్గత వ్యతిరేకతను మళ్లించే ప్రయత్నమా?**

యూనస్ చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం భారత్-బంగ్లాదేశ్ సంబంధాలకే కాకుండా.. బంగ్లాదేశ్ అంతర్గత రాజకీయాలపై కూడా చర్చకు దారితీస్తున్నాయి. పలువురు విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. దేశీయ వ్యతిరేకత దారి మళ్లింపులో వ్యూహం ప్రకారం చేస్త యూనస్ పాలనపై దేశంలో పెరుగుతున్న వ్యతిరేకతను, విమర్శలను దారి మళ్లించేందుకే ఆయన భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. చైనా, పాకిస్తాన్‌లతో యూనస్‌కు ఉన్న సన్నిహిత సంబంధాలు భారత్‌తో బంగ్లాదేశ్ సంబంధాలను మరింతగా దెబ్బతీస్తున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మైనారిటీ సంఘాల ఆందోళన**

యూనస్ ప్రకటనలను బంగ్లాదేశ్‌లోని మైనారిటీ సంఘాలు పూర్తిగా ఖండిస్తున్నాయి. దేశంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని, తమ భద్రతపై ఆందోళన ఉందని మైనారిటీ సంఘాలు గట్టిగా చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో యూనస్ వ్యాఖ్యలు వారికి మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మొత్తంగా యూనస్ భారత్ వ్యతిరేక ధోరణిని కొనసాగిస్తే, అది బంగ్లాదేశ్ అంతర్గత రాజకీయాలతో పాటు దక్షిణాసియా ప్రాంతీయ సంబంధాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని, అంతేకాకుండా ఆయన పాలనకు అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తప్పదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# బాలయ్య మరో సంచలనం... మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై షాకింగ్ రియాక్షన్



**హైదరాబాద్ పెన్ పవర్:** హిందూపురం ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలపై ఎప్పుడో కానీ సాధారణంగా మాట్లాడని బాలయ్య ప్రతిపక్షం వైసీపీ టార్గెట్ గా ఆదివారం పలు విమర్శలు గుప్పించారు. ఇటీవల అసెంబ్లీ ఎపిసోడ్ తో బాలయ్య వ్యవహారంపై రాష్ట్రంలో రాజకీయ రచ్చ కొనసాగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొద్దిరోజులుగా సైలెంటు అయిన బాలయ్య సడన్ గా వైసీపీ ఆందోళన చేస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై తనదైన విశ్లేషణ చేశారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మించామని హడావుడి చేస్తున్న వైసీపీపై హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఐదేళ్లలో రూ.212 కోట్లు ఖర్చు చేసిన వైసీపీ తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీపీపీ విధానంపై తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీలను నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పీపీపీ విధానం ప్రవేశపెట్టడాన్ని సమర్థించిన బాలయ్య.. ఈ విధానంలో మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే మానిటరింగ్ చేస్తుందని స్పష్టం చేశారు. పీపీపీ అంటే ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రైవేటు యాజమాన్యం కళాశాలలను నిర్వహిస్తుందని బాలయ్య వివరించారు.

పీపీపీ విధానంలో కాలేజీల నిర్వహణను ప్రైవేటుకు అప్పగించినా ప్రభుత్వ నియంత్రణ కొనసాగుతుందని బాలయ్య వ్యాఖ్యానించారు. ప్రైవేటు వారికి ఓ బాధ్యత, భయం ఉంటుందని క్వాలిటీ ఉంటుందని ఆయన వివరించారు. పీపీపీలో ప్రభుత్వ కమిటీ పర్యవేక్షిస్తుందని బాలయ్య తెలిపారు. ప్రైవేటు వారికి ఇచ్చినా ప్రభుత్వ నియంత్రణ ఉంటుందని, అప్పుడు వచ్చిన ఇబ్బందేముందని ఆయన ప్రశ్నించారు.

మళ్లీ అధికారంలోకి రావాలనే ఆరాటంతో వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బాలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో చేసిందేమీ లేదని, ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావాలనే ఉబలాటంతో వ్యర్థ ప్రసంగాలు చేస్తున్నారని విమర్శించారు బాలయ్య. వైసీపీ నేతల ప్రకటనలు కేవలం రాజకీయమేనని, వారికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని అన్నారు. వైసీపీది కేవలం ప్రచార ఆర్భాటంగా తేల్చేసిన బాలయ్య.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాన్ని గట్టిగా సమర్థించారు. ఎమ్మెల్యేగానే కాకుండా బసవతారకం ప్రైవేటు ఆస్పత్రి చైర్మన్ హోదాలో బాలయ్య వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాధారణంగా ప్రభుత్వ వ్యవహారాలపై బాలయ్య ఎప్పుడూ ఇలా స్పందించలేదు. కానీ ఇప్పుడు ఆయన ప్రత్యేకంగా మాట్లాడటం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

# చలో సింగపూర్.. వచ్చేనెల నుంచి విమాన సర్వీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మించడంలో కీలక భాగస్వామిగా ఉన్న సింగపూర్ కు రాష్ట్రం నుంచి నేరుగా విమాన సర్వీసు ప్రారంభం కానుంది. వచ్చేనెల 15న గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్ విమాన సర్వీసు ప్రారంభానికి ఇండిగో సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. రాజధానితోపాటు రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కోసం సింగపూర్ ప్రభుత్వం రూ.45 వేల కోట్లు పెట్టుబడి పెడుతోంది. అయితే ఏపీ నుంచి సింగపూర్ కు విమాన కనెక్టవిటీ లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర విమానయాన శాఖతో సంప్రదించి కొత్త విమాన సర్వీసు ప్రారంభానికి చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు. నవంబర్ 15 నుంచి గన్నవరం-సింగపూర్ విమాన సర్వీసు అందుబాటులో రానుంది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఈ విమానం నడవనుంది. విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్ లోని చాంగీ విమానాశ్రయాల మధ్య ఈ విమాన సర్వీసులు తిరగనున్నాయి. సీఎం చంద్రబాబు జూలై 28న సింగపూర్ లో పర్యటించిన సమయంలోనే ఈ సర్వీసు విషయంపై ప్రస్తావన వచ్చింది. అప్పట్లో ప్రవాసాంధ్రులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు వంద రోజుల్లోనే విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇక భవిష్యత్తులో విజయవాడ-సింగపూర్ మధ్య కోటి మందికి పైగా ప్రయాణాలు చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ విమాన కనెక్టవిటీతో అమరావతికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. విశ్వనగరంగా అమరావతిని తీర్చిదిద్దాలంటే ప్రపంచ దేశాలు అన్నింటితో కనెక్టవిటీ మెరుగుపడాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. ఈ నూతన విమాన సర్వీసు ఏపీని సన్ రైజ్ స్టేటుగా ప్రపంచానికి మరింత చేరువ చేస్తుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు.

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన తయారీలో సింగపూర్ 2014లోనే ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్ ప్రభుత్వం, సర్బానా జురాంగ్ వంటి సింగపూర్ అంతర్జాతీయ

పట్టణ ప్రణాళిక సంస్థల సహకారంతో రాజధాని నగరం, సీడ్ డెవలప్‌మెంట్ ఏరియా కోసం మూడు మాస్టర్ ప్లాన్‌లను రూపొందించారు. ఈ మాస్టర్ ప్లాన్లలో ఆధునిక, సుస్థిర పట్టణీకరణ సూత్రాలను పొందుపరిచారు. దీనికి సింగపూర్ విజయవంతమైన పట్టణాభివృద్ధి అనుభవం ఆధారంగా చేసుకున్నారు. అయితే 2019లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత అమరావతి ప్రాజెక్ట్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించారు. సింగపూర్ ప్రభుత్వం అమరావతి అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కొత్త విమాన సర్వీసు ప్రారంభంతో ఈ పనులు మరింత వేగవంతమయ్యే పరిస్థితి ఉందంటున్నారు.

# విశాఖలో ఫస్ట్: ‘సిఫీ’ డేటా సెంటర్‌కు లోకేష్ శంకుస్థాపన.. లాభాలు ఇవే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీకి ఐటీ రాజధానిగా విరాజిల్లుతున్న విశాఖకు మరో మణిహారం వచ్చి చేరింది. ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌గా పిలిచే ఏఐ ఎడ్జ్ డేటా కేంద్రానికి తాజాగా ఆదివారం ఉదయం మంత్రి నారా లోకేష్ శంకు స్థాపన చేశారు. ప్రముఖ డిజిటల్ ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ దీనిని ఏర్పాటుచేస్తోంది. ఈ కేంద్రం ద్వారా 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్‌తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా.. ఏఐ ఆధారత డేటాను విశాఖ కేంద్రం నిక్షిప్తం చేయనున్నారు. దీనిలో 50 మెగా వాట్ల డేటాను నిక్షిప్తం చేయనున్నారు. ఇది తాజా అంచనా. భవిష్యత్తులో 550 మెగా వాట్ల డేటా సామర్థ్యాన్ని పెంచను న్నారు. దీనికి గాను మొత్తం 15 వేల కోట్ల రూపాయలను సంస్థ వెచ్చించనుంది. ప్రాథమికంగా వచ్చే రెండే ళ్లలో 1500 కోట్ల రూపాయలను ఖర్చు చేయనుంది. తర్వాత దశల వారీగా 15 వేల కోట్ల మేరకు పెట్టుబడు లు పెట్టనుంది. ఈ సంస్థ రాకతో ప్రస్తుతం 1000 మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఈ డేటా కేంద్రాన్ని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 29 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. రుషికొండలో 3.6 ఎకరాలు, పరదేశి పాలెంలో 20 ఎకరాలను ప్రభుత్వం ఇవ్వనుంది. ప్రస్తుతం రుషికొండపై ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో 2027 నాటికి పూర్తిస్థాయిలో డేటా కేంద్రం అందుబాటులోకి రానుంది. వాస్తవానికి సిఫీ సంస్థకు దేశవ్యాప్తంగా బ్రాంచులు ఉన్నాయి. అయితే.. ఏపీలో మాత్రం ఇదే తొలిసంస్థ కావడం విశేషం.

**ఇవీ లాభాలు..**

1) దశల వారీగా 10 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పన జరగనుంది.
2) దేశంలోని అన్ని డేటా కేంద్రాల్లో కెల్లా ఇదే పూర్తిస్థాయి అతి పెద్ద కేంద్రం.-
3) విశాఖ ఐటీ రాజధానిగా అవతరించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుంది.
4) ప్రపంచ స్థాయి కంపెనీలు సైతం ఇక్కడకు వచ్చే వీలుంది.
5) క్వాంటం కంప్యూటింగ్‌లో ఈ డేటా కేంద్రం కీలక పాత్ర పోషించనుంది.

# మారిన అంతర్జాతీయ రాజకీయం.. మోడీకి ట్రంప్ పిలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ రాజకీయాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య కొనసాగుతున్న గాజా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతో కుదిరిన శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆహ్వానం అందింది. ఈ సమావేశం ఈజిప్టు వేదికగా జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ఆహ్వానం వివరాలు**

ఇజ్రాయెల్, హమాస్‌లు ట్రంప్ ప్రకటించిన గాజా శాంతి ప్రణాళిక మొదటి దశకు అంగీకరించాయి. ఈ ఒప్పందంలో బందీల విడుదల, ఇజ్రాయెల్ సైన్యాల ఉపసంహరణ వంటి కీలక అంశాలు ఉన్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన అధికారిక సంతకాలు.. తదుపరి చర్యల కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రధాని మోదీని ఆహ్వానించారు. అంతేకాకుండా, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్ సిసి కూడా మోదీకి ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.

గాజా శాంతి ప్రణాళిక విజయంపై ప్రధాని మోదీ ఇప్పటికే ట్రంప్‌కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. ఈ చరిత్రాత్మక ఒప్పందం శాశ్వత శాంతికి తొలి అడుగు అని ఆయన అభివర్ణించారు.

**అంతర్జాతీయంగా భారత్ పాత్ర**

ప్రపంచ శాంతి , స్థిరత్వానికి భారత్ ఎల్లప్పుడూ ఇస్తున్న మద్దతును అమెరికా గుర్తించిన నేపథ్యంలో మోదీకి ఈ ఆహ్వానం అందింది. మధ్యప్రాచ్య సమస్యపై భారత్ తీసుకుంటున్న సమతుల్య వైఖరిని అంతర్జాతీయ సమాజం ప్రశంసిస్తోంది. గాజాలో శాంతి నెలకొల్పేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాల్లో భారత్ భాగస్వామ్యం కావడం, ఈ అంతర్జాతీయ వేదికపై దేశం ప్రాధాన్యతను పెంచుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు**

ప్రధాని మోదీ ఈ సమావేశానికి హాజరవుతారా లేదా అనే అంశంపై భారత ప్రభుత్వం లేదా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలో ఈ విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పాప్ సింగర్ తో మాజీ ప్రధాని రాసలీలలు.

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత జీవితాన్ని రహస్యంగా ఉంచుకునేవారు. నాలుగు గోడల మధ్య జరిగే విషయాలు ప్రజల ముందుకు రాకుండా చూసుకునేవారు. కానీ ఈరోజు రాజకీయాలు మారిపోయాయి. సోషల్ మీడియా యుగంలో నాయకులు తమ వ్యక్తిగత జీవితం కూడా బహిరంగం చేస్తూ నిరంతరం ప్రజల దృష్టిలో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ జాబితాలో కెనడా మాజీ ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో కూడా చేరిపోయాడు. తాజాగా ట్రూడోకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఆ ఫోటోలలో అతడు ప్రముఖ అమెరికా పాప్ సింగర్ కెటీ ఫెర్రీతో సరస సల్లాపాలలో మునిగి తేలుతున్నట్టు కనిపిస్తోంది. సముద్ర తీరంలో బోటులో విహార యాత్ర చేస్తూ, ఫెర్రీని ముద్దు పెడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ట్రూడో అర్ధనగ్నంగా కళ్ళకు గాగుల్స్ వేసుకుని ఉండగా, కెటీ ఫెర్రీ ఈత దుస్తుల్లో కనిపిస్తోంది. ఇద్దరూ సన్నిహితంగా ఆలింగనం చేసుకున్న ఫోటోలు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. జస్టిన్ ట్రూడో 2023లో తన భార్య సోఫీ గ్రెగోయర్ తో విడిపోయాడు. దాంతో అతడు ప్రస్తుతం ఒంటరిగానే జీవిస్తున్నాడు. అదే సమయంలో కెటీ ఫెర్రీ నటుడు ఓర్లాండో బ్లూమ్తో సుదీర్ఘ ప్రేమలో ఉంది. అయితే ఇటీవల వారి వివాహం వాయిదా పడింది. ఆ తర్వాత ఇద్దరూ వేరువేరుగా వెళ్లిపోయారు. ఈ సమయంలోనే ట్రూడో , ఫెర్రీకి పరిచయం ఏర్పడినట్టు సమాచారం. ఆ పరిచయం క్రమంగా సన్నిహిత సంబంధానికి దారి తీసిందని అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ప్రస్తుతం వారిద్దరూ ఒకరితో ఒకరు డేటింగ్‌లో ఉన్నారని, కలిసి ప్రయాణాలు చేస్తూ కనిపిస్తున్నారని సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ట్రూడో గతంలో భారత్‌పై చేసిన వ్యాఖ్యలతో పెద్ద వివాదం రేపాడు. భారత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన ఆయనకు ఆ తర్వాత కెనడాలోనే వ్యతిరేకత పెరిగింది. చివరికి తన ప్రధానమంత్రి పదవిని కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆయన వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ ఘటనతో సోషల్ మీడియా రెండు వర్గాలుగా విడిపోయింది. కొందరు “ఇది ఆయన వ్యక్తిగత జీవితం” అని అంటుండగా, మరికొందరు “మాజీ ప్రధానమంత్రి స్థాయికి తగని ప్రవర్తన” అంటూ విమర్శిస్తున్నారు. ఏదేమైనా, ట్రూడో%-%ఫెర్రీ జంట ప్రస్తుతం అంతర్జాతీయ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# ప్రజలే నిర్ణయించాలి.. రుషికొండపై పబ్లిక్ ఓపీనియన్ కు ప్రత్యేక వెబ్ సైట్



**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖలోని రుషికొండపై రూ.450 కోట్లతో నిర్మించిన అత్యంత విలాసవంతమైన భవనాలను ఎలా వినియోగించాలో తేల్చుకోలేని కూటమి ప్రభుత్వం.. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని భావించింది. గత ప్రభుత్వం ఎంతో రహస్యంగా నిర్మించిన రుషికొండ భవనాల నిర్వహణే భారంగా మారిందని కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. పర్యాటక శాఖ పరిధిలో నిర్మించిన ఈ భవనాలు టూరిజం అభివృద్ధికి కూడా ఉపయోగపడే అవకాశం లేదని కూటమి మంత్రులు తేల్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాటిని ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది.వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని రుషికొండపై పున్నమి రిసార్ట్ ను తొలగించి వాటి స్థానంలో అత్యంత విలాసమైన నాలుగు భవనాలను నిర్మించారు. ఈ భవన నిర్మాణాల సమయంలోనే తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. పర్యావరణ అనుమతులు లేకుండా, కొండను తొలచి భవనాలను నిర్మిస్తున్నారని అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు పలుమార్లు ఆందోళనలు నిర్వహించాయి. ప్రతిపక్ష నేతలుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఆయా భవనాలను సందర్శించి ప్రభుత్వ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శలు గుప్పించారు. అయితే ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా అప్పటి ప్రభుత్వంలో ఉన్న వైసీపీ మొండిగా భవన నిర్మాణాలు పూర్తిచేసింది.

అత్యంత వివాదాస్పదంగా మారిన రుషికొండపై భవనాలు నిర్మాణం పూర్తయిన వెంటనే ఎన్నికలు రావడం, వాటి ప్రారంభం వాయిదా పడింది. అప్పట్లో విశాఖను పాలనా రాజధానిగా చేస్తామని ప్రకటించిన మాజీ సీఎం జగన్మోహనరెడ్డి తన క్యాంపు కార్యాలయం కోసమే ఆ భవనాలు నిర్మించారని ప్రచారం జరిగింది. అయితే కోర్టు వివాదాల వల్ల ఆ విషయాన్ని వైసీపీ బహిరంగంగా ప్రకటించలేకపోయింది. ఇక అధికారం చేతులు మారిన తర్వాత రుషికొండ నిర్మాణాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైసీపీని మరింత డామేజీ చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నించింది. అంతేకాకుండా రూ.450 కోట్లు పెట్టి ఎందుకూ పనికిరాని భవనాలను నిర్మించారని ప్రచారం చేసింది. మరోవైపు భవనాలను ఎలా వినియోగించాలనే అంశాలపై సూచనలు సలహాలు ఇవ్వాలని మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది.ఈ నేపథ్యంలో నాలుగు నెలల తర్వాత ఇటీవల సమావేశమైన మంత్రుల కమిటీ భవనాల వినియోగంపై చర్చించింది. ఇదే సమయంలో ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించి ప్రత్యేక వెబ్ సైట్ సిద్ధం చేసింది. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజలు తమ సలహాలు, సూచనలను %తీబంష్త్రఅనశీఅఝఝజ్‌ఎ.అఅ% అనే వెబ్ సైట్ లో నమోదు చేయొచ్చని వెల్లడించింది. ఈ నెల 17 లోగా సూచనలు పంపాలని నిర్దేశించింది ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని కీలక అంశాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటోంది. అమరావతిలో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ఇదేవిధంగా ఓపీనియన్ పోల్ నిర్వహించగా, తాజాగా రుషికొండపైన అదే పంథాలో ప్రభుత్వం ముందుకెళుతోందని అంటున్నారు.

# ప్రజలు ఏం కోరుకుంటున్నారు? డిప్యూటీ సీఎం పవన్ ట్వీట్ లో ఆసక్తికర అంశాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వం నుంచి ప్రజలకు ఏం కావాలి? ఉచిత పథకాలతో సంక్షేమ పాలన సాగాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారా? అభివృద్ధి పథకాలను ఆశిస్తున్నారా? అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఉండాలని అనుకుంటున్నారా? పాలకులు, ప్రతిపక్ష నేతలు, రాజకీయ విశ్లేషకుల మధ్య ఎప్పుడూ ఈ డిబేట్ జరుగుతూనే ఉంటుంది. కానీ ప్రజల తీర్పు మాత్రం చాలా డిఫరెంటుగా ఉంటుంది. అయితే ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ మధ్య ఎక్స్ వేదికగా సాగిన సంభాషణ ఇంటర్నెట్ లో తీవ్ర చర్చకు దారితీసింది.16 నెలల క్రితం ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్ ఇటీవల కాలంలో పాలనా వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో పరిపాలన అంశాలపై ఎక్కువగా అధికారులపై ఆధారపడిన ఆయన ఇప్పుడు తన అనుభావాన్ని జోడించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాలను కూడా ఆచరణలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ట్వీట్ ను రీట్వీట్ చేసిన పవన్ ఆసక్తికర వ్యాఖ్యను జోడించారు.ఏడేళ్ల క్రితం 2018లో తిత్లీ తుఫాన్ వచ్చినప్పుడు శ్రీకాకుళం జిల్లాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటించగా, అప్పట్లో బాధితులతో పవన్ మాట్లాడిన ఫొటోను నాదెండ్ల మనోహర్ తాజాగా ఎక్స్ లో షేర్ చేశారు. ఈ పోస్టులో తాను ఉప ముఖ్యమంత్రి పవన్ తో మొదలుపెట్టిన ప్రయాణంపై అనుభవాలను వివరించారు. క్లిష్ట సమయాల్లో పవన్ తమను ఎలా మోటివేట్ చేశారో అందులో వెల్లడించారు. దీనిపై ఎక్స్ లో పవన్ స్పందించారు. నాదెండ్ల పోస్టును రీట్వీట్ చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు పోస్టు చేశారు.తనకు ఇప్పటికీ తుపాను బాధితులతో మాట్లాడిన విషయాలు గుర్తున్నాయని తెలిపిన పవన్, ప్రజలు ఉచితాలు కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. వారు ఉచితాలను అడగడం లేదు, వారు ఎటువంటి సంక్షేమ పథకాలను కోరుకోవడం లేదు కానీ 'మాకు 25 ఏళ్ల భవిష్యత్తు ఇవ్వండి, ఉచితాలు కాదని గట్టిగా చెప్పారని పవన్ తన ట్వీట్ లో పేర్కొన్నారు. మన యువత నిజమైన సామర్థ్యాన్ని మనం ఉపయోగించుకోవాలని వారి కలలను నెరవేర్చుకోవడానికి అర్థం చేసుకోడానికి నేను మన యువతను కలుస్తూనే ఉంటానని ఉద్ఘాటించారు.

# తమ్ముళ్ల తొందర: తంబళ్లపల్లిలో క్యూ కట్టారుగా.. !




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జిగా నిన్న మొన్నటి వరకు వ్యవహరించిన జయ చంద్రారెడ్డి ఇటీవల ఆ పదవి నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. నకిలీ మద్యం కేసులో చంద్రారెడ్డి హస్తం కూడా ఉందని పోలీసులు నిర్ధారించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఫలితంగా నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పోస్టు ఖాళీ అయింది. అయితే, ఇప్పుడు ఈ పోస్టును దక్కించుకునేందుకు తమ్ముళ్ళు క్యూ కట్టారు. మాకంటే మాకే ఇవ్వాలని లెక్కకు మిక్కిలిగా నాయకులు పోటీ పడుతున్నారు.తాజాగా ఇద్దరు నాయకులు వేరువేరుగా వచ్చి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు. తంబళ్లపల్లి ఇన్చార్జి పోస్టు తమకు ఇవ్వాలని ఇద్దరు వేరువేరుగా కోరడం వేరువేరుగా వినతి పత్రాలు ఇవ్వడం పార్టీలో ఆసక్తిగా మారింది. వాస్తవానికి వైసీపీకి కంచుకోటగా ఉన్న తంబళ్లపల్లి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కూడా వైసిపి నేత పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి విజయం సాధించారు. అయితే గత కొన్ని నెలలుగా టిడిపి ఇన్చార్జిగా ఉన్న జయ చంద్రారెడ్డి ఇక్కడ దూకుడు ప్రదర్శించారు.అన్ని కార్యక్రమాలు ఆయనే నిర్వహించడం, ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ఆయనే పాల్గొనడం ద్వారా వైసిపిని దాదాపు తెరమరుగు చేయాలన్న వ్యూహంతో అడుగులు వేశారు. కానీ, అనూహ్యంగా నకిలీ మద్యం కేసు రావడంతో ఆయన తప్పుకున్నారు. ఇప్పుడు అదే పోస్టును కోరుకుంటున్న కీలకమైన వారిలో బీసీ నాయకుడు శంకర యాదవ్ తో పాటు శ్రీరామ్ చినబాబు కూడా ఉన్నారు. ఇద్దరు కూడా తమకు కావాలంటే తమకు కావాలని పట్టుబట్టడంతో పాటు స్థానికంగా ఉన్న పరిస్థితులపై ఇరువురు వేరువేరుగా నివేదికలు సమర్పించారు.మెజారిటీ నాయకులు, కార్యకర్తలు తమతోనే ఉన్నారని తమ ఆధ్వర్యంలోనే పార్టీ పుంజుకుంటుందని వారు చెప్పడం గమనార్హం. అయితే, ఇప్పటికిప్పుడు ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకునే అవకాశం లేదన్నది పల్లా శ్రీనివాసరావు అంతర్గతంగా చెబుతున్న మాట. కొన్నాళ్లపాటు ఆ పోస్టును ఖాళీగానే ఉంచి అసలు నియోజకవర్గం లో ఏం జరుగుతుందన్న విషయంపై చంద్రబాబు ఆరా తీస్తున్నారని ఇప్పటికిప్పుడు వేరే వ్యక్తిని మార్చినా పరిస్థితులు సర్దుబాటు అవుతాయా లేదా అనే అంశంపై కూడా ఆయన చర్చిస్తున్నారని సమాచారం.

అయితే తమకు కావాలంటే తమకు కావాలని నాయకులు పట్టు పట్టడంతో ఈ వ్యవహారం మరింత వివాదంగా మారే అవకాశం ఉందని కూడా అంచనా వేస్తున్నారు. ఎలా చూసినా తంబళ్లపల్లి నియోజకవర్గం లో టిడిపి పుంజుకుంటున్న దశలో అనూహ్యంగా నకిలీ మద్యం కేసు రావడం, ఇప్పుడు పదవుల కోసం తమ్ముళ్లు పోటీ పడటం వంటివి పార్టీలో చర్చనీయాంశంగా మారాయి నే చెప్పాలి. మరి చివరికి ఏం జరుగుతుంది చంద్రబాబు ఎలా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# గ్రీన్‌కార్డ్‌కు అడ్డంకి.. భర్త గతం భార్య కలను కడతేర్చిందా?




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో ఉన్నత విద్య, మంచి ఉద్యోగం... ఆ తర్వాత అమెరికన్ పౌరుడితో వివాహం చేసుకొని గ్రీన్‌కార్డ్ (శాశ్వత నివాసం) సాధించడం అనేది లక్షలాది మంది విదేశీ విద్యార్థుల కల. కానీ, ఒక్కోసారి అనూహ్య సమస్యలు ఈ కలను కడతేరుస్తాయి. సరిగ్గా అలాంటి పరిస్థితే అమెరికాలో చదువుకుంటున్న ఓ విదేశీ విద్యార్థినికి ఎదురైంది.

తన అమెరికన్ ఫియాన్సీ గతంలో ఉన్న క్రిమినల్ కేసు, ముఖ్యంగా 'వాహనం దొంగతనం' కేసులో ఉన్న ఫెలనీ వారెంట్ ఇప్పుడు ఆమె గ్రీన్‌కార్డ్ కలపై పెను నీడ వేసింది.

**వీసా గడువు – గ్రీన్‌కార్డ్ టెన్షన్**

F-1 విద్యార్థి వీసాతో అమెరికాలో చదువుకున్న ఆ యువతి, ప్రస్తుతం ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ కింద పనిచేస్తోంది. ఈ %వూ౦% వీసా గడువు డిసెంబర్ వరకు మాత్రమే ఉంది. అంటే ఆ సమయం లోపల ఆమె గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆలస్యం చేస్తే చట్టపరమైన హోదా కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ ఒత్తిడిలోనే ఆమె వివాహాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకుంది.

**కఠినమైన తనిఖీలు: జీవిత భాగస్వామి రికార్డే కీలకం**

అమెరికాలో వివాహ ఆధారిత గ్రీన్‌కార్డ్ దరఖాస్తులను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అధికారులు చాలా కఠినంగా పరిశీలిస్తారు. అభ్యర్థి (ఇక్కడ విద్యార్థిని) ఎలాంటి నేరం చేయకపోయినా, ఆమె భర్త గతంలో నేరాలకు పాల్పడితే, అది అప్లికేషన్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. క్రిమినల్ రికార్డులు ఉన్న జీవిత భాగస్వాములు ఉన్న దరఖాస్తులను USCIS అధికారులు ప్రత్యేకంగా విచారిస్తారు.

అనుమానాస్పద లేదా అసంపూర్తి పత్రాలు ఉన్న దరఖాస్తులకు అధికారులు Notice to Appear (NTA) జారీ చేయవచ్చు. దీని అర్థం, ఆ దరఖాస్తుదారుని డిపోర్టేషన్ (దేశం నుండి బహిష్కరణ) ప్రక్రియ కోసం ఇమ్మిగ్రేషన్ కోర్టుకు పంపడం. ఈ మధ్యకాలంలో ఇమ్మిగ్రేషన్ విధానాలు మరింత కఠినంగా మారడం, అధికారులకు వ్యక్తిగత విచక్షణ ఆధారంగా కేసులను సమీక్షించే అధికారం ఉండటం వల్ల, ఫలితాలు చాలా అనిశ్చితంగా ఉంటున్నాయి.

**న్యాయ సహాయం... ఇక తప్పనిసరి!**

OPT గడువు సమీపిస్తున్నందున, ఆలస్యం చేయడానికి వీల్లేదు. భర్త గతం భార్య భవిష్యత్తుపై నీడ వేసిన ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, గ్రీన్‌కార్డ్ దరఖాస్తు నిలిపివేయడం సరైన నిర్ణయం కాదు. సరైన న్యాయ సలహా తీసుకోవడం ముఖ్యం.

ఈ యువతి తన అమెరికా కలను నిలబెట్టుకోవాలంటే, అనుభవజ్ఞులైన ఇమ్మిగ్రేషన్ న్యాయవాది సహాయం తీసుకోవడం అత్యంత సురక్షితం. క్రిమినల్ రికార్డు వివరాలను పూర్తిగా విశ్లేషించి, దాని వల్ల ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం ఎలాంటి సమస్యలు వస్తాయో ముందుగానే అంచనా వేయగలరు. దరఖాస్తు తిరస్కరణకు లేదా జాప్యానికి దారితీసే పొరపాట్లు జరగకుండా, అన్ని పత్రాలను పకడ్బందీగా సిద్ధం చేయగలరు.ప్రేమ, వివాహం, గ్రీన్‌కార్డ్ ఈ మూడూ ఆమె జీవితంలోని కీలక దశలు. భర్త గతానికి తగిన చట్టపరమైన పరిష్కారం చూపించి, సమయానుకూలంగా గ్రీన్‌కార్డ్ దరఖాస్తు దాఖలు చేస్తేనే, ఆమె అమెరికా కల నిలబడుతుంది. ఇప్పుడు ఆమె తీసుకోవాల్సిన ప్రతి అడుగు చాలా జాగ్రత్తగా, న్యాయపరమైన సలహాతో కూడుకున్నదై ఉండాలి.

# బీజేపీ బలమేంటో చెప్పిన ఓవైసీ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాజకీయంగా అత్యంత చురుకైన, అప్రమత్తమైన పార్టీ అని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు అలసత్వం వహిస్తే, "రెప్పపాటులోనే బీజేపీ తన పని పూర్తి చేస్తుంది" అంటూ ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

**బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది!**

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఒవైసీ, బీజేపీ పనితీరును వివరిస్తూ ప్రతిపక్షాలకు ఒక రకంగా హెచ్చరిక పంపారు. బీజేపీ ఒక "24 గంటలూ పని చేసే పార్టీ" అని ఆయన అభివర్ణించారు. వారి వ్యూహాలు చాలా పక్కాగా ఉంటాయని, రాజకీయాల్లో వారు ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటారని పేర్కొన్నారు.

**ప్రతిపక్షాలకు సూచన**

"ప్రతిపక్షాలు అప్రమత్తంగా లేకపోతే, బీజేపీ తన లక్ష్యాలను సాధించడానికి పెద్దగా సమయం పట్టదు" అని, కేవలం రెప్పపాటులో వారు తమ పని పూర్తి చేస్తారని వ్యాఖ్యానించారు.

**ఓటు చోరీ ఆరోపణలు, ఓటర్ల జాబితా తనిఖీ**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణలను ఆయన ఖండించారు. 2009, 2014 ఎన్నికల సమయంలోనే తన నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో డూప్లికేట్ పేర్లను గుర్తించి తాను సవాల్ చేశానని ఒవైసీ గుర్తు చేశారు. ప్రతి పార్టీ కూడా కేవలం ఆరోపణలు చేయడం కాకుండా, ఓటర్ల లిస్టును సీరియస్‌గా తనిఖీ చేయాలని ఒవైసీ సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అవగాహన, ప్రతి ఓటు విలువ చాలా ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీజేపీ తన శక్తిని, విస్తరణను పెంచుకుంటున్న తరుణంలో, బీజేపీ బలంపై ఒవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రతిపక్షాల ఐక్యత, వ్యూహాలపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి. ప్రతిపక్షాలు తమ కార్యాచరణను పునఃపరిశీలించుకోవాల్సిన అవసరాన్ని ఆయన మాటలు బలంగా స్పష్టం చేస్తున్నాయి.

**బీజేపీ ప్రధాన బలాలు**

బలమైన జాతీయవాద భావజాలం హిందుత్వం : భారతీయ సంస్కృతి, హిందూ మతం..ఇతర భారతీయ మతాల (జైన, సిక్కు, బౌద్ధ) రక్షకురాలిగా తనను తాను భావించడం. జాతీయవాదం, సాంస్కృతిక సంప్రదాయాలను బలంగా నమ్ముతుంది.

**భావసారూప్యత:** ఈ భావజాలం పార్టీకి కోర్ ఓటర్లను మరియు పటిష్టమైన మద్దతుదారుల సమూహాన్ని అందిస్తుంది.

**పటిష్టమైన సంస్థాగత యంత్రాంగం :** బీజేపీకి దేశవ్యాప్తంగా బలమైన పార్టీ యంత్రాంగం ఉంది. బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు కమిటీలు, కార్యకర్తల నెట్‌వర్క్ చాలా పటిష్టంగా ఉంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీలలో ఒకటిగా 170 మిలియన్లకు పైగా సభ్యులు ఉన్నట్లు పేర్కొంది (2022 నాటికి).కేంద్రంలో అధికారం – నాయకత్వం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జనాదరణ.. నిర్ణయాత్మక నాయకత్వం పార్టీకి ప్రధాన బలం. ఆయన నేతృత్వంలో కేంద్రంలో వరుసగా మూడుసార్లు (కూటమితో కలిపి) ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది.

చారిత్రక విజయాలు: 1984లో కేవలం 2 సీట్లతో మొదలై, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 303 సీట్లు గెలుచుకోవడం ఈ పార్టీ బలాన్ని సూచిస్తుంది.**కీలక విధాన నిర్ణయాలు :** ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి హామీలను నెరవేర్చడం ద్వారా తమ నిబద్ధతను నిరూపించుకుంది. అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెప్పుకోవడం, అలాగే అనేక సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలు (ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్యాస్ కనెక్షన్లు, టాయిలెట్లు, తాగునీటి సదుపాయం) అమలు చేయడం.

**కూటమి బలం :** నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమిని ఏర్పాటు చేయడం ద్వారా లోక్‌సభలో సంఖ్యా బలాన్ని పెంచుకొని కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది.మొత్తంగా బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ సహా ఏ ప్రతిపక్షం కూడా బలమైన ప్రత్యర్థిగా కనిపించడం లేదు. అందుకే ఓవైసీ కూడా బీజేపీ ఏమరపాటుగా ఉంటే ఏసేస్తుందని స్పష్టం చేశాడు.

## మా బౌలర్లను మరీ అంతలా కొట్టొద్దయ్యా.. టీమిండియా ఓపెనర్‌కు లారా స్వీట్ రిక్వెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ భారీ సెంచరీ చేసి అదరగొట్టాడు. ఢిల్లీ వేదికగా అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో 175 పరుగులు చేసి విండీస్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపించాడు. దాదాపు 70 స్ట్రైక్ రేట్ తో జైశ్వాల్ బ్యాటింగ్ చేయడం విశేషం. ఈ టీమిండియా ఓపెనర్ ను ఔట్ చేయడానికి విండీస్ బౌలర్ల వల్ల కాలేదు. చివరికి రనౌట్ రూపంలో ఔట్ కావడంతో వెస్టిండీస్ జట్టు ఊపిరి పీల్చుకుంది. ఈ మ్యాచ్ లో జైశ్వాల్ ఇన్నింగ్స్ కు విండీస్ దిగ్గజ బ్యాటర్ బ్రియాన్ లారా ఫిదా అయ్యాడు. మ్యాచ్ తర్వాత జైశ్వాల్ ఇన్నింగ్స్ ను ప్రశంసించాడు. తొలి రోజు మ్యాచ్ ముగిసిన తర్వాత లారా జైశ్వాల్ దగ్గరకు వచ్చి సరదాగా ముచ్చటించాడు. ఈ సంభాషణలో భాగంగా ఈ విండీస్ లెజెండ్ ఓ స్పెషల్ రిక్వెస్ట్ చేయడం గమనార్హం. మరీ ఎక్కువగా మా బౌలర్లను కొట్టొద్దని సరదాగా రిక్వెస్ట్ చేశాడు. ఆ తర్వాత 'సరదాగా అంటున్నాను. నువ్వు చాలా బాగా ఆడావు' అని ప్రశంసించాడు. యశస్వి కూడా నవ్వుతోనే సమాధానం ఇచ్చాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మ్యాచ్ లో తొలి రోజు జైశ్వాల్ సెంచరీ బాదితే రెండో రోజు గిల్ శతకం కొట్టాడు. జైస్వాల్ 604 రోజుల తర్వాత స్వదేశంలో మూడు అంకెల మార్కును చేరుకున్నాడు. చివరిసారిగా 2024లో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో జైశ్వాల్ సెంచరీ చేశాడు. ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో రెండు డబుల్ సెంచరీలు చేయడం విశేషం. అప్పటి నుంచి స్వదేశంలో ఐదు హాఫ్ సెంచరీలు చేసినా సెంచరీ మార్క్ అందుకోలేకపోయారు. 23 ఏళ్ళ వయసులోనే 7 సెంచరీలు బాదిన జైశ్వాల్ అరుదైన ఘనతలను అందుకున్నాడు. అతిచిన్న వయస్సు (23 ఏళ్లు)లోనే టెస్ట్ ఫార్మాట్?లో అత్యధిక (5) సార్లు 150 ప్లస్ స్కోర్లు సాధించిన

రెండో ఆటగాడిగా రికార్డ్ సృష్టించాడు. జైశ్వాల్ 23 ఏళ్ల వయసులో 5 సార్లు 150 ప్లస్ స్కోర్ చేశాడు. జైశ్వాల్ కంటే ముందు ఈ రికార్డ్ ఆసీస్ దిగ్గజం సర్ బ్రాడ్ మాన్ పేరిట ఉంది.బ్రాడ్ మాన్ 23 ఏళ్ల వయసులో 8 సార్లు 150 ప్లస్ స్కోర్ చేసి ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈయన తర్వాత 5 సార్లు 150 స్కోర్ చేసి జైశ్వాల్ రెండో స్థానంలో ఉన్నాడు. తద్వారా148 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో డాన్ బ్రాడ్‌మాన్ మాత్రమే సాధించిన ఘనతను యశస్వి జైస్వాల్ సాధించడం ద్వారా పుస్తకాలలో తన పేరును లిఖించుకున్నాడు. 22 ఫోర్లతో 258 బంతుల్లో 175 పరుగులు చేసిన జైశ్వాల్ టెస్ట్ క్రికెట్ కెరీర్?లో ఇది ఏడో సెంచరీ కావడం విశేషం. ఇందులో 5 సెంచరీలు 150 ప్లస్ స్కోర్ కావడం మరో హైలైట్.

## ఒక్క దెబ్బకు మూడు రికార్డులు బ్రేక్: మహిళల వన్డే క్రికెట్ హిస్టరీలోనే తొలి ప్లేయర్‌గా స్మృతి రేర్ ఫీట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది ?ఫుల్ ఫామ్?లో ఉన్న టీమిండియా మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మందనా రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలోనే వన్డే ఫార్మాట్?లో తాజాగా మరో మూడు అరుదైన రికార్డులు సొంతం చేసుకుంది మందనా. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో ఒక క్యాలెండర్ ఇయర్?లో 1000 పరుగులు చేసిన ఏకైక ప్లేయర్‌గా రికార్డ్ సృష్టించింది. ఉమెన్స్ వరల్డ్ కప్?లో భాగంగా విశాఖపట్నంలో ఆదివారం (అక్టోబర్ 12) ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచులో మందనా ఈ ఫీట్ నెలకొల్పింది. దీంతో పాటుగా భారత్ తరుపున వన్డేల్లో 5 వేల పరుగులు పూర్తి చేసుకున్న రెండో మహిళా క్రికెటర్?గా నిలిచింది. ఈ జాబితాలో మందనా కంటే ముందు టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ ఉన్నారు. మిథాలీ వన్డేల్లో 7,805 పరుగులు చేసి –భారత్?తో పాటు మహిళల వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన తొలి మహిళా క్రికెటర్?గా



కొనసాగుతున్నారు.

**మహిళల వన్డేల్లో ఒక క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక పరుగులు**

1,068 – స్మృతి మంధాన (భారతదేశం), 18 ఇన్నింగ్స్‌లో 2025

970 – బెలిండా క్లార్క్ (ఆస్ట్రేలియా), 14 ఇన్నింగ్స్‌లలో – 1997

882 – లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా), 18 ఇన్నింగ్స్‌లలో – 2022

880 – డెబ్బీ హాక్లీ (న్యూజిలాండ్), 16 ఇన్నింగ్స్‌లలో – 1997

853 – అమీ సాటర్త్‌వైట్ (న్యూజిలాండ్), 14 ఇన్నింగ్స్‌లలో – 2016

**మహిళల వన్డేల్లో అత్యధిక పరుగులు**

7,805 – మిథాలీ రాజ్ (భారతదేశం), 211 ఇన్నింగ్స్‌లలో

5,992 – షార్లెట్ ఎడ్వర్డ్స్ (ఇంగ్లాండ్), 180 ఇన్నింగ్స్‌లలో

5,925 – సుజీ బేట్స్ (న్యూజిలాండ్), 167 ఇన్నింగ్స్‌లలో

5.873 – స్టెఫానీ టేలర్ (వెస్టిండీస్), 163 ఇన్నింగ్స్‌లలో

5,022 – స్మృతి మంధాన (భారతదేశం), 112 ఇన్నింగ్స్‌లలో

## జట్టు కోసం గాయంతోనే బ్యాటింగ్.. చివరికి వీల్ చైర్‌లో గ్రౌండ్ నుంచి బయటకి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్ సీనియర్ బ్యాటర్ రహమత్ షా చూపించిన పట్టుదలకు హ్యాట్సాఫ్ చెప్పకుండా ఉండలేం. తీవ్ర గాయంతో గ్రౌండ్ నుంచి బయటకు వెళ్లిన రహమత్ షా.. గాయం వేధిస్తున్న జట్టు కోసం మళ్ళీ గ్రౌండ్ లోకి బ్యాటింగ్ చేయడానికి వచ్చి తన డెడికేషన్ చూపించాడు. శనివారం (అక్టోబర్ 11) అబుదాబిలోని షేక్ జాయెద్ స్టేడియంలో బంగ్లాదేశ్ తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇన్నింగ్స్ 15వ ఓవర్లో రహమత్ షా కాలికి తీవ్ర గాయం కావడం కావడంతో బ్యాటింగ్




కొనసాగించలేకపోయాడు. దీంతో గ్రౌండ్ వదిలి రిటైర్డ్ హర్ట్ గా వెళ్ళిపోయాడు. జట్టు 9 వ వికెట్ కోల్పోయినప్పుడు రహమత్ షా తన పట్టుదలను చూపించాడు. తన నొప్పిని పక్కనపెట్టి జట్టు కోసం బ్యాటింగ్ ఆడాలని నిర్ణయించుకున్నాడు. కానీ ఈ ఆఫ్ఘన్ బ్యాటర్ ఒక బంతి మాత్రమే అడగలిగాడు. ఆ తర్వాత క్రీజులో నిలబడలేకపోయాడు. దీంతో వీల్‌చైర్‌లో గ్రౌండ్ నుండి తీసుకు వెళ్లాల్సి వచ్చింది. రహమత్ వీల్‌చైర్‌లో మైదానం నుంచి బయటకు వెళ్తున్న క్లిప్‌ను ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు తమ అధికారిక ఎక్స్ లో పోస్ట్ చేసింది. " దేశం కోసం తన శరీరాన్ని త్యాగం చేసిన రహమత్ షా తన డెడికేషన్ చూపించాడు. అతను నడవలేకపోయినా బ్యాటింగ్ చేయడానికి సిద్ధపడ్డాడు". అని ఏసీబీ తమ ప్లేయర్ గురించి గొప్పగా పోస్ట్ చేసింది. ఈ మ్యాచ్ విషయానికి వస్తే ఏకపక్షంగా జరిగిన రెండో వన్డేలో బంగ్లాదేశ్ పై 81 పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్తాన్ ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 44.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ ఒక్కడే పోరాడాడు. 95 పరుగులు చేసి జట్టు స్కోర్ లో సగానికి పైగా రన్స్ చేశాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిదీ హసన్ మీరాజ్ మూడు వికెట్లతో రాణించాడు. 191 పరుగుల ఛేజింగ్ లో బంగ్లాదేశ్ కేవలం 28.3 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. రషీద్ ఖాన్ 5 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.



## క్రేజీ కాంబో షూటింగ్ పూర్తి.. త్వరలోనే అనౌన్స్‌మెంట్

కొన్ని కాంబినేషన్లకు ఉండే క్రేజ్, వాటికి ఉండే హైప్ వేరు. అయితే కొన్ని ఊహించని కాంబినేషన్లు కూడా చిత్ర పరిశ్రమలో ఆసక్తిని పెంచుతాయి. ఇప్పుడలాంటి కాంబినేషనే బాలీవుడ్ లో ఒకటి తెరకెక్కుతుంది. అదే రణ్‌వీర్ సింగ్, శ్రీలీల, బాబీ డియోల్ కలిసి చేస్తున్న సినిమా. వీరంతా కలిసి సినిమా చేయడంతో దీనికి సంబంధించిన అప్డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా అని అందరూ వెయిట్ చేస్తున్నారు.

**షూటింగ్ పూర్తి చేసుకున్న రణ్‌వీర్, శ్రీలీల మూవీ**

రణ్‌వీర్, శ్రీలీల కలిసి సినిమా చేస్తున్నారని వార్తలొచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై ఆడియన్స్ ఎంతో ఎగ్జైటింగ్ గా ఉన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి లీకైన కొన్ని లుక్స్ మరియు సెట్ లో కొన్ని స్పష్టమైన ఫోటోలు ఆ ఆసక్తిని ఇంకాస్త పెంచగా, ఆ సినిమా గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది. రణ్‌వీర్, శ్రీలీల, బాబీ డియోల్ నటిస్తున్న ప్రాజెక్టుకు సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తైందని తెలుస్తోంది.

**వర్కవుట్ అయిన లీడ్ రోల్స్ కెమిస్ట్రీ**

సినిమాలో రణ్‌వీర్ మరియు శ్రీలీల మధ్య కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అవడంతో పాటూ సినిమాలో వారి పెయిర్ చాలా ఫ్రెష్ గా, ఎనర్జిటిక్ గా ఉందని, వారిద్దరి యాక్టింగ్ ఆడియన్స్ ను కచ్ఛితంగా ఆశ్చర్యపరుస్తుందని, వారంలోపే ఈ సినిమాకు సంబంధించిన మేజర్ అనౌన్స్‌మెంట్ రానుందని అంటున్నారు. అయితే ఈ మూవీ టైటిల్ ఏంటనేది ఇంకా వెల్లడి కాలేదు.

**డిసెంబర్ 5న ధురంధర్ రిలీజ్**

ఈ ఇయర్ లో రానున్న మోస్ట్ ఎగ్జైటింగ్ ప్రాజెక్టుగా ఈ మూవీని నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తుండగా, సినిమాలో రణ్‌వీర్ స్క్రీన్ ప్రెజెన్స్, శ్రీలీల గ్లామర్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనున్నాయని సన్నిహిత వర్గాలంటున్నాయి. రణ్‌వీర్ సింగ్ ఓ వైపు ఈ ప్రాజెక్టు చేస్తూనే మరోవైపు ధురంధర్ అనే సినిమాను కూడా చేస్తున్నారు. రియల్ లైఫ్ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ధురంధర్ డిసెంబర్ 5న రిలీజ్ కానుండగా ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com